నిర్భయవార్త తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY

**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జ్‌లు మండలాల వారిగా విలేకరులు కావలెను.
సంప్రదించండి
సెల్ : 7799013939

సంపుటి :12 సంచిక :316 రంగారెడ్డి | బుధవారం 11 మార్చి 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00
Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada

## వచ్చే ఏడాది జూన్‌లో
# గోదావరి పుష్కరాలు

హైదరాబాద్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిది : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్యాత్మికతకు, టెంపుల్ టూరిజానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గోదావరి పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ 26న మొదలై జులై 7వరకు కొనసాగుతాయని తెలిపారు. అందుకు సంబంధించి అన్ని విభాగాల అధికారులు, పోలీసు యంత్రాగం సమన్వయంతో వచ్చే మీటింగ్ నాటికి ఒక రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, పురాతన ఆలయాలను అభివృద్ధి చేసేలా సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కోమటిరెడ్డి, పొంగులేటి మాట్లాడారు. 'గోదావరి నది మహారాష్ట్రలో పుట్టినా.. నది పరివాహకం ఎక్కువ తెలంగాణ రాష్ట్రంలో ఉంటుంది. నిజామాబాద్ జిల్లా కందకుర్తిలో మొదలై భద్రాచలం వరకు ప్రవహిస్తుంది. ఈ



వందల కిలోమీటర్ల ప్రాంతంలో ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాలు (బాసరా, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచలం)ఎంతో చరిత్ర కలిగిన గుళ్లు ఉన్నాయి. గోదావరి నదిని తెలంగాణ గంగా నదిగా పిలుచుకుంటాం. పుష్కరాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ అన్ని విధాల ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హ్యామ్ మోడల్ రోడ్ల కనెక్టివిటీతో పాటు అవసరమైన కాంక్రీట్ రోడ్లు, పుష్కర ఘాట్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తుంది. ప్రధానంగా వాహనాల రాకపోకలు, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్ పై దృష్టి సారించాలి. ఇప్పటికే బాసర ఆలయ అభివృద్ధి ప్లాన్‌కు సీఎం ఆమోదం తెలిపారు. త్వరలో భద్రాచలం దేవస్థానం మాస్టర్ ప్లాన్ రూపొందించాలి' అని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత లేకుండా కేంద్రం చర్యలు



ఢిల్లీ, మార్చి 10 నిర్భయవార్త : ఇరాన్ యుద్ధం భారత్‌లో చమురు ఆందోళనలు రేకెత్తిస్తోంది. దేశ ప్రజలకు ఇంధన, గ్యాస్ కొరత ఏర్పడకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురితో చర్చలు జరిపారు. ఎల్‌పీజీ ఉత్పత్తులు, సరఫరాపై సమీక్ష జరిపారు. ఇరాన్ యుద్ధం సామాన్యులపై ప్రభావం చూపకూడదని ప్రధాని మోదీ మంత్రులకు తెలిపారు. అలాగే యుద్ధంతో ఉత్పన్నమయ్యే అంతరాయాల గురించి చర్చించారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు పరిశ్రమల నుంచి గ్యాస్‌ను మళ్లించడం ద్వారా ప్రజలకు గ్యాస్ కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఇరవై ఒక్క రోజుల తర్వాత బుకింగ్‌లు జరిగేవి, ఇప్పుడు25 రోజులకు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలానే ఎల్పీజీ ఉత్పత్తిని 10 శాతం పెరిగిందని కేంద్ర వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ యుద్ధంతో హర్మూజ్ జలసంధి నుంచి నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కృత్రిమ కొరత కలగకుండా కేంద్రం ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ ప్రయోగించింది. బ్లాక్ మార్కెటింగ్, నిల్వలను నియంత్రించే ఉద్దేశంతో పెట్రోలియం శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో దాదాపు రెండున్నర లేదా మూడు రోజుల్లో వినియోగదారులకు గ్యాస్ సరఫరా జరిగేది, ప్రస్తుత పరిస్థితుల్లో కూడా అదే సమయం పడుతుందని వర్గాలు తెలిపాయి. అన్ని శుద్ధి కర్మాగారాలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి, దేశవ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు 60 లక్షల సిలిండర్లు సరఫరా అవుతున్నాయని కేంద్ర వర్గాలు చెబుతున్నాయి.

## రైతులపై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు.. బండి సంజయ్



హైదరాబాద్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిది: రాజన్న సిరిసిల్ల జిల్లాలో రంగనాయక్ సాగర్ కెనాల్ పనులు పూర్తి చేయాలంటూ నిరసనకు దిగిన రైతులను అరెస్ట్ చేయడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ఖండించారు. మంగళవారం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు నిరసన చేస్తే వారిని అరెస్ట్ చేస్తారా అంటూ మండిపడ్డారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలానికి నీళ్లిచ్చే కాలువ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని కేంద్రమంత్రి ప్రశ్నించారు. రూ. 3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. కాలువ పనులు పూర్తి చేసి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రంగనాయక్ సాగర్ ద్వారా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ రైతు ద్రోహి అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల వైఫల్యాల వల్ల రైతులు వరుసగా పంటలు నష్టపోతున్నారని కేంద్రమంత్రి అన్నారు. తక్షణమే పనులు ప్రారంభించకపోతే ఆయా ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. న్యాయం చేయాలని అడిగిన రైతులను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. రైతులకు సంఘీభావం తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపీ సహా పార్టీ నాయకులను స్టేషన్‌కు తరలించడం అక్రమమని కేంద్రమంత్రి తీవ్రంగా మండిపడ్డారు. రైతులపై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తక్షణమే రైతులను, బీజేపీ నేతలను బేషరతుగా విడుదల చేయాలన్నారు. రంగనాయక్ సాగర్ 11వ ప్యాకేజీ నుంచి ఎల్ఎం 4, ఎల్ఎం 6 ద్వారా కాలువ పనులను పూర్తి చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

## 13న రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు..



ఢిల్లీ, మార్చి 10 నిర్భయవార్త :దేశంలోని కోట్లాది మంది అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీఎం కిసాన్‌కు సంబంధించిన 22వ విడత నిధులు.. ఈ నెల 13న రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. దేశ వ్యాప్తంగా రూ. 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ. 2000 వేల చొప్పున జమ కానున్నాయి. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో పీఎం-కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ప్రతి ఏటా మూడు దఫాలుగా రూ. 2 వేల చొప్పున మొత్తం రూ. 6వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ ఏడాది మొత్తం రూ. 19వేల కోట్ల నిధులు విడుదల చేయనున్నారు. గత ఏడాది నవంబర్ 19వ తేదీన 21వ విడత పీఎం-కిసాన్ నిధులు విడుదల చేశారు. ఈ పథకం ద్వారా దేశంలో పదకొండు కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకు 21 విడతల్లో రూ. 4 లక్షల కోట్లకు పైగా అన్నదాతలకు ఈ నిధులు అందించబడ్డాయి. కాగా, ఏపీ ప్రభుత్వం ఇదే సమయంలో పీఎం-కిసాన్‌తో కలిపి అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే.

## వెలుగుమట్ల బాధితుల సమస్యపై కవిత ఆగ్రహం..



హైదరాబాద్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిది: భూదాన్ భూములు అంటేనే పేద వాళ్ళకు ఇచ్చినవని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా ఖమ్మం అంబేద్కర్ భవన్‌లో నిరాహారదీక్ష చేసిన కవితను పోలీసులు అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించారు. ఈ సందర్భంగా జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వెలుగుమట్ల ఇళ్లు కూలగొట్టి అధికారులు కర్కశంగా వ్యవహరించారని మండిపడ్డారు. బాధితులను అంబేద్కర్ భవన్‌లో ఉంచారని.. బాధితుల పట్ల ప్రభుత్వం పగబట్టినట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జేఏసీ నేత విశారదన్‌తో కలిసి ఉద్యమించామని కవిత అన్నారు. నిరవధిక దీక్షకు దిగితే తాను టెర్రరిస్ట్ అయినట్లు అరెస్ట్ చేశారని ఫైర్ అయిన కవిత.. సమస్య పరిష్కారం అయ్యే వరకు దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు. పెద్ద వాళ్లకు భూములు అప్పగించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. కూలగొట్టిన చోటే వాళ్ళకు ఇళ్ళు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ.. వెలుగుమట్లలో ఏం జరిగిందో తెలుసుకోవాలన్నారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఒక్కరి తప్పు ఉంటే అందరి ఇళ్ళు కూల్చుతారా అని ప్రశ్నించారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ పిల్లలు ఉన్నారని... వారు పరీక్షలు ఎలా రాయాలని నిలదీశారు. 'కలెక్టర్‌కు బాధ్యత ఉందా.. ముగ్గురు మంత్రులకు ఇది కనపడటం లేదా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం అధికారం ఉందని కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూల్చుతారని ప్రశ్నించారు. అవసరం అయితే కోర్టులో పిల్ వేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద వాళ్ళ పట్ల లెక్కలేనితనంతో వ్యవహరిస్తోందంటూ కవిత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## కేంద్ర మంత్రులకు మంత్రి పొన్నం లేఖ



హైదరాబాద్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిది: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పొన్నం ప్రభాకర్ లేఖలో కోరారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు దయ కాదు.. తెలంగాణ హక్కు అన్నారు. పన్నులు చెల్లిస్తున్నప్పుడు ప్రజల అభివృద్ధికి ఎందుకు చర్యలు చేపట్టట్లేదని పొన్నం లేఖలో పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై బండి సంజయ్, కిషన్‌రెడ్డి బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలన్నారు. తెలంగాణ ప్రజల న్యాయమైన డిమాండ్లు విస్మరించడం తగదన్నారు. కేంద్ర ప్రయోజిత పథకాల్లో కేంద్ర వాటా 90శాతం ఉండే విధంగా పునరుద్ధరించాలని మంత్రి పొన్నం లేఖలో కేంద్ర మంత్రులను కోరారు.

# కాంగ్రెస్ మోసాన్ని ఎండగడతాం : కేటీఆర్

హైదరాబాద్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిది : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేస్తున్న తీరును ఎండగట్టేందుకు... ఆరు గ్యారెంటీలకు ఇచ్చిన మాట ప్రకారం చట్టబద్ధత కల్పించేందుకు ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భారత రాష్ట్ర సమితి తరపున ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ రోజు గోల్కొండ రిసార్ట్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఉమ్మడి ఓరియంటేషన్ సమావేశం ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే తొలి క్యాబినెట్ సమావేశంలోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీని, ఆ మాటను మరిచిపోయిందని అన్నారు. అందుకే ఆరు గ్యారెంటీల ద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ఈ బిల్లు ద్వారా ఎండగడతామన్నారు. 6 గ్యారంటీలలో పేర్కొన్న మహిళలు, వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు, రైతన్నలు వంటి తెలంగాణ సబ్బండ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసం నేపథ్యంలో ఆయా వర్గాల తరఫున ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేటీఆర్ తెలిపారు. తెలంగాణ వార్తలు
కాంగ్రెస్ పార్టీ మోసాన్నిఎండగడతాం..
రాహుల్ గాంధీతో సహా 6 గ్యారంటీలకు చట్టబద్ధత ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పెద్దలు కాంగ్రెస్ పార్టీ మోసాన్ని కూడా ఈ బిల్లు ద్వారా శాసనసభలో ఎండగడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యులు కూడా ఈ బిల్లుకు మద్దతు ఇచ్చి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈసారి కాంగ్రెస్ పెడుతున్న బడ్జెట్.. మూడవ బడ్జెట్. ఈసారి బడ్జెట్ సమావేశాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇప్పటికే సగం ప్రభుత్వ పదవీ కాలం అయిపోయింది. హామీల అమలులో ప్రజలు ఇచ్చిన వ్యవధి అయిపోయింది. వారి హామీల అమలు వైఫల్యాన్ని, మోసాన్ని ఎండగట్టేందుకు ఈ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం పైన ఈరోజు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాల పైన ఈ అసెంబ్లీ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం పైన చర్చించామని కేటీఆర్ తెలిపారు. మా పార్టీ సీనియర్ నేతలు మధుసూదనాచారి, బండ ప్రకాష్, తలసాని శ్రీనివాస్ యాదవ్,



సబితా ఇంద్రా రెడ్డి తదితరులు మాట్లాడారు.

నిర్భయవార్త

సంపాదకీయం

బుధవారం 11, మార్చి 2026

# గతి తప్పిన సభ


వచ్చే ఏడాదికి రాష్ట్ర గతిని నిర్ణయించే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సరైన దశ దిశ లేకుండానే ముగియడం ప్రజలకు నష్టదాయకం. ఈ పరిస్థితికి అధికార టిడిపి కూటమి, ప్రధాన ప్రతిపక్షం వైసిపిలదే బాధ్యత. ఫిబ్రవరి 11న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమైన సమావేశాలను మార్చి 6 వరకు నిర్వహించగా, ఉభయ సభలూ భేటీ అయింది పక్షం రోజులు. కాగా అత్యధిక దినాలు తిరుమల లడ్డూ కల్తీ అంశం కేంద్రంగా సాగిన కూటమి, వైసిపి పరస్పర తిట్ల దండకాలు జుగుప్స కలిగించాయి. ఇరు పక్షాల మధ్య డైలాగ్ వార్ పరిధులు దాటి మతం రంగు పులుముకోవడం అభ్యంతరకరం. లౌకిక రాజ్యాంగంపై ప్రమాణం చేసి కొలువులు వెలగబెడుతున్న మంత్రులే పలుమార్లు నిండు సభలో ఆజ్యం పోసి మతం చుట్టూ తిప్పడం ఆందోళన కలిగిస్తుంది. శాసనసభలో ప్రతిపక్ష హోదా ఇవ్వలేదంటూ వైసిపి సభ్యులు తొలి రోజు గవర్నర్ ప్రసంగానికి కొన్ని నిమిషాలు పాల్గొని వాకౌట్ చేసి ఇక సభ వైపు కన్నెత్తి చూడలేదు. మెజార్టీని చూసుకొని మండలికి హాజరైనా అక్కడ కూడా ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై కంటే స్వీయ రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చింది. లడ్డూపై చర్చకు పట్టుబట్టి నాలుగు రోజులపాటు సభా కార్యకలాపాలను సాగనీయలేదు. లడ్డూపై అసెంబ్లీలో చర్చించిన సర్కార్, మండలిలో చర్చకు రెడీ అంటూనే దాటవేత చర్యలకు దిగింది. అసెంబ్లీలో చర్చకు వైసిపి వెళ్లలేదు. మండలిలో ప్రభుత్వమే చర్చ జరక్కుండా పన్నాగాలు రచించింది. లడ్డూపై చర్చ విషయంలో రెండు పక్షాలదీ పలాయనవాదంగా కనిపిస్తుంది. లడ్డూపై చర్చ పేరిట మండలిలో కనివిని ఎరుగని సన్నివేశాలు చోటు చేసుకోవడం బాధాకరం. మండలి ఛైర్మన్ మోషేను రాజు మతం గురించి మంత్రులు ప్రస్తావించి నాలుక్కరుచుకొని తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. ఛైర్మన్ సైతం తనది ఫలాన మతం అని ప్రకటించారు. మండలిలో వైసిపిని ఎదుర్కొనేందుకు పది మంది వరకు మంత్రులు తిష్ట వేశారంటే కూటమి సర్కార్ ఫోకస్ ఏమిటో అర్థమవుతుంది. అటు శాసనసభలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్, పలువురు మంత్రులు, కూటమి సభ్యులు వివాదాస్పద రీతిలో మతం ప్రస్తావనలు చేశారు. ప్రతిపక్షం లేకపోవడంతో శాసనసభ కూటమి పార్టీల సమావేశాన్ని తలపించింది. గత వైసిపి ప్రభుత్వంపై విమర్శలు, కూటమి సర్కార్‌పై పొగడ్తలతో సరిపోయింది. పలు అంశాలపై సిఎం చేసిన సుదీర్ఘ ప్రకటనలు సరేసరి. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ వివాదాస్పదమైంది. సూపర్ సిక్స్‌లోని ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి -- జాబ్ కేలండర్ సహా ఏభై ఏళ్లు నిండిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు పింఛన్ తదితర హామీలపై ఈ సమావేశాల్లోనూ సర్కార్ స్పష్టత ఇవ్వలేదు. కౌలు రైతులకు కొత్త చట్టం ఊసే లేదు. రూ. 3.32 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఊహలతో నిండిపోయింది. చివరి రోజు ప్రవేశపెట్టిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలు వైసిపి, కూటమి ప్రభుత్వాల్లోని అవినీతి, అక్రమాల చిట్టాలు విప్పి బోనులో నిలబెట్టింది. రాష్ట్రానికి జీవనాడిగా పేర్కొనే పోలవరం ప్రాజెక్టు అక్రమాలకు అడ్డాగా మారిందని రెండు ప్రభుత్వాల పనితీరును అద్దంలో చూపెట్టింది. దయాఫ్రంవాల్ నుంచి నిర్వాసితులకు పరిహారం, కాంట్రాక్టర్లకు వడ్డీ లేకుండా వందల కోట్లు ధారాదత్తం వరకు అన్నింటా చేతివాటమేనని కాగ్ నిర్ధారించింది. నిర్వాసితులకు సహాయ పునరావాసం 11 శాతమే పూర్తయిందని తేల్చడం ద్వారా లక్షకుపైన నిర్వాసితుల కుటుంబాల మనోవ్యథను అక్షరబద్ధం చేసి ప్రభుత్వాల అబద్ధపు ప్రచారాన్ని తుత్తునియలు చేసింది. ముంపు ప్రాంతాల గుర్తింపునకు చేసిన లైడార్ సర్వే వివరాలు కాగ్‌కు ప్రభుత్వం ఇవ్వలేదంటే ఏ వ్యవస్థ పట్ల లెక్కలేదని తెలుస్తుంది. ఆదాయార్జన శాఖల్లో లోపాలు, కేంద్రం నుంచి 15 వేల కోట్ల తగ్గుదల, అప్పులు, చేబదుళ్లతో ఖజానా నిర్వహణ, వేల కోట్ల కార్మిక సంక్షేమ బోర్డు నిధుల మళ్లింపు ఇత్యాది ప్రభుత్వ ఆర్థిక అరాచకాలను కాగ్ ఎత్తి చూపింది. ఆడిట్ పేరాలను ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తోందన్న కాగ్ వ్యాఖ్య తీవ్రమైనది. కాగ్ అభ్యంతరాలపై పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ప్రభుత్వం చర్చించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# ట్రంప్, నెతన్యాహు దురహంకారం-మోడీ మౌనం



ట్రంప్ సామ్రాజ్యవాద దురహంకారంతో, నెతన్యాహు జాత్యహంకారంతో ఇరాన్‌పై అత్యంత పాశవిక దాడి చేస్తున్నారు. అకస్మాత్తుగా ఫిబ్రవరి 28 తెల్లవారుజామున ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా అనేక నగరాలపై అమెరికా-ఇజ్రాయిల్ ఏకకాలంలో బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్ సుప్రీం నేతతో పాటు, ఆ దేశానికి చెందిన 40 మంది పాలనా, అధికార యంత్రాంగంలోని కీలక వ్యక్తులను తొలిరోజే హత్య చేశాయి. విద్యార్థినుల పాఠశాలపై బాంబుల దాడి చేసి 160 మంది చిన్నారులను బలితీసుకున్నాయి. విశాఖపట్నంలో జరిగిన ఐ.ఎఫ్.ఆర్ కి వచ్చి వెనక్కు వెళ్తున్న ఇరాన్ నౌకపై అమెరికా దాడి చేసి 100 మంది సైనికులను శ్రీలంక సముద్ర జలాల్లో హత్యగావించింది. ఇప్పటికే సుమారు 1300 మందికి పైగా ఇరాన్ పౌరులు ప్రాణాలు కోల్పోగా, వేల సంఖ్యలో గాయలపాలయ్యారు. కోట్ల విలువైన ఆస్తులు ధ్వంసమైపోతున్నాయి. ఈ దాడులు సెప్టెంబర్ వరకు కొనసాగుతాయని ట్రంప్, ఇరాన్ కొత్త నేతలనందరిని మట్టుపెడతామని నెతన్యాహు యుద్ధోన్మాదంతో ప్రకటనలు చేస్తున్నారు. ఆధునిక చరిత్రలో గత ఫిబ్రవరి నెల అత్యంత విషాదకరమైంది. 3వ తేదీ తెల్లవారుజామున అమెరికా సైన్యం వెనిజులా అధ్యక్ష భవనంలోకి జొరబడి నిద్రిస్తున్న ఆ దేశ అధ్యక్షుడిని భార్యతో సహా కిడ్నాప్ చేసి, బంధించింది. 28 తెల్లవారుజామున 80 సంవత్సరాలకు పైబడిన ఇరాన్ సుప్రీం నేతతో పాటు ఆయన కుటుంబ సభ్యులను హత్య చేసింది. ఈ రెండు సంఘటనల మధ్యలో ఇజ్రాయిల్ ఇరాన్‌పై 12 రోజులు యుద్ధం చేసింది. ఆ యుద్ధాన్ని ఇరాన్ ప్రతిఘటించడంతో అమెరికా రంగ ప్రవేశం చేసి బాంబుల వర్షం కురిపించి యుద్ధాన్ని ముగించినట్లు ప్రకటించింది. ఒమెన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న చర్చలు పరిష్కారం దిశగా సాగుతున్నాయని సామ్రాజ్యవాద మీడియా ద్వారా ప్రపంచాన్ని, ముఖ్యంగా ఇరాన్ ప్రజలను నమ్మించి ట్రంప్, నెతన్యాహు దొంగ దెబ్బ తీశారు. వెనిజులా, ఇజ్రాయిల్ ఆయిల్ వనరులను కొల్లగొట్టి ప్రపంచ ఆధిపత్యాన్ని సాధించాలని అమెరికా, పాలస్తీనాలో సాగిస్తున్న జాత్యహంకార ఉన్మాదాన్ని ప్రపంచమంతటికి విస్తరింప చేసేందుకు ఇజ్రాయిల్ ఈ దాడులకు తెగబడ్డాయి. ఇరాన్‌పై ట్రంప్ చేస్తున్న దాడులను అత్యధిక మంది అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. సి.ఎన్.ఎన్ పోల్, రాయిటర్స్/ఇప్సోస్, ది వాషింగ్టన్ పోస్ట్ నిర్వహించిన పోల్‌లో 60 శాతం మంది ట్రంప్ చర్యను వ్యతిరేకించారు. ట్రంప్‌నకు తప్పుడు ప్రాధాన్యతలు ఉన్నాయని 68 శాతం మంది అమెరికన్లు అంటున్నారు. డెమోక్రాట్లతో పాటు రిపబ్లికన్లు వ్యతిరేకిస్తున్నారు. మన కేంద్ర ప్రభుత్వం మాత్రం మౌనం పాటిస్తున్నది. వెనిజులా, ఇరాన్ మన దేశానికి చిరకాల మిత్రదేశాలు, మనకు అవసరమైన ముడి చమురులో అత్యధికం ఈ దేశాల నుండే సరఫరా అవుతుంది. అలాంటి దేశాలపై జరుగుతున్న ఈ క్రూర దాడులను కనీసం ఖండించలేకపోవడానికి... అమెరికా, ఇజ్రాయిల్ నేతలతో దేశ పాలకులకు వున్న కార్పొరేట్ అనుకూల, మతతత్వ అనుబంధం ప్రధాన కారణం. ఆర్థిక సంక్షోభంలో అమెరికా ట్రంప్ అధికారంలోకి వచ్చే నాటికి అమెరికా ఆర్థిక సంక్షోభంలో వుంది. 2021లో 6.2 శాతం వున్న ఆర్థికాభివృద్ధి 2025లో 2 శాతానికి చేరుకోవడం కష్టంగా మారింది. ఇదే కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి 4.4 శాతం నుండి 0.3 శాతానికి పడిపోయింది. అభివృద్ధి లేకపోవడంతో ఆ దేశం అప్పుల్లో కూరుకుపోయింది. 2020లో 593 బిలియన్ డాలర్లుగా వున్న లోటు 2024 నాటికి 1,185 బిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రపంచంలో అతి పెద్ద రుణగ్రస్త దేశంగా మారింది. ఈ సంక్షోభం నుండి బయటపడడానికి తన సైనిక బలగం, డాలర్ పెత్తనాన్ని ప్రపంచంపై రుద్దుతోంది. అయితే ఇటీవల అనేక దేశాలు అమెరికాను పక్కనబెట్టి తమ మధ్య వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడంతో పాటు, ఉమ్మడి కరెన్సీని సృష్టించుకుంటుండంతో బెంబేలెత్తిపోయింది. షాంఘై కూటమిలోని సభ్య దేశాల ఐక్యతను సహించలేక పోతోంది. సుంకాల పెంపు, ఆర్థిక ఆంక్షలను విధించడంతో పాటు ప్రపంచ న్యాయ సూత్రాలను, ఐక్యరాజ్యసమితిని బేఖాతరు చేస్తోంది. తానే సృష్టించుకున్న డబ్ల్యుటివోను బహిష్కరించింది. దేశాల దురాక్రమణకు సిద్ధమవుతున్న అమెరికానాడు హిట్లర్ లాగే నేడు ట్రంపు సామ్రాజ్యవాద దురాక్రమణకు సిద్ధమయ్యాడు. ఇరాన్, లెబనాన్, వెనిజులా, క్యూబా, మెక్సికో, నికరాగువా, పనామా, కొలంబియా, కెనడా, గ్రీన్‌లాండ్ ఇలా 11 దేశాలపై యుద్ధానికి కాలు దువ్వుతున్నాడు. ఇప్పటికే పాలస్తీనాలో గాజాను సర్వనాశనం చేసి, వేలాది చిన్నారుల, ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్న జాత్యహంకారి నెతన్యాహును తోడు చేసుకుని ఇరాన్‌పై విరుచుకుపడుతున్నాడు. గత మూడున్నర దశాబ్దాలుగా పశ్చిమాసియా దేశాల మధ్య చిచ్చు రగిల్చి లాభపడిన అమెరికా నేడు ప్రత్యక్షంగా ఆయా దేశాల్లో జొరబడాలని చూస్తున్నది. మొదట ఇరాన్-ఇరాక్ మధ్య ఆ తర్వాత ఇరాక్-కువైట్ ల మధ్య ఘర్షణలను సృష్టించింది. ఇరాక్‌లో జీవ రసాయన ఆయుధాలు వున్నాయంటూ ఆ దేశ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను ఉరితీసింది. ఇప్పుడు ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు వున్నాయని యుద్ధం చేస్తున్నది. బిజెపి కేంద్ర ప్రభుత్వ వైఖరి ట్రంప్, నెతన్యాహు లను ఆయా దేశాల ప్రజలు ఈసడించుకుంటున్నా, న్యాయస్థానాలు తీర్పులు ఇస్తున్నా మన కేంద్ర ప్రభుత్వం మాత్రం నిస్సిగ్గుగా వారిని బలపరుస్తున్నది. 'ఆపరేషన్ సిందూర్' మొదలు సుంకాల వరకు అనేక రకాలుగా మన దేశాన్ని అగౌరవపరుస్తూ ట్రంప్ చేస్తున్న ప్రకటనలను, విధానాలను ప్రధాని మోడీ ప్రతిఘటించకపోగా లొంగిపోయి గులాంగిరి చేస్తున్నారు. 'మై డియర్ ఫ్రెండ్' అంటూ ట్రంప్ కౌగిలిలో గతంలో పులకరించిపోయారు. తాజాగా ఇజ్రాయిల్‌ను ఫాదర్ లాండ్ అంటూ నెతన్యాహును ఆలింగనం చేసుకుని మురిసిపోతున్నారు. సార్వభౌమత్వ దేశాలపై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దురాగతాలకు పరోక్షంగా బలపరుస్తున్నారు. ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి మన దేశానికి చిరకాలంగా మిత్ర దేశంగా వున్న రష్యా నుండి చమురును కొనుగోలు చేయడం నిలిపివేశారు. ఇంత కాలం మన దేశానికి అవసరమైన చమురులో 20 శాతానికి పైగా ఇరాన్ నుండి ఏ ఆటంకం లేకుండా సరఫరా అవుతుంది. అలాంటి దేశంపై జరుగుతున్న నరమేధాన్ని మన దేశం ఖండించకపోవడం అన్యాయం. రష్యా నుండి చమురు దిగుమతికి సైతం అమెరికా అధ్యక్షుడు అనుమతించినట్టుగా వార్తలు రావడం సార్వభౌమత్వ దేశానికి సిగ్గుచేటు. రాష్ట్రంలోని టిడిపి, వైసిపి పార్టీలు కూడా మౌనం పాటిస్తున్నాయి. అమెరికాను చూసి కేంద్రం, కేంద్రాన్ని చూసి మన రాష్ట్ర పాలక, ప్రతిపక్ష పార్టీలు భయపడి విధానాలను, కనీస నైతికతను గాలికి వొదలేస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న నరమేధాన్ని మతోన్మాదంతో ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంస్థలు వివిధ మాధ్యమాల ద్వారా బలపరుస్తున్నాయి. ఈ యుద్ధం కొనసాగితే దేశంలో చమురు నిల్వలు తగ్గిపోయి, ధరలు భారీగా పెరుగుతాయి. అమెరికా-ఇజ్రాయిల్ గెలిస్తే తమ ఇష్టారీతిన చమురు అమ్మకాలతో పాటు మరిన్ని దేశాలపై తెగబడతాయి. సార్వభౌమత్వ దేశాధినేతలను కిడ్నాప్, హత్యలు చేయడాన్ని అంగీకరిస్తే రేపు అదే పరిస్థితి మన దేశానికి రాదనే గ్యారంటీ ఏమిటీ? ఇవేవీ ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలకు పట్టడంలేదు. ఇరాన్ ప్రజల మతాన్ని మాత్రమే చూసి అక్కడ జరుగుతున్న నరమేధాన్ని బలపరచడం మానవత్వం అనిపించుకోదు. గతంలో బ్రిటన్ సామ్రాజ్యవాదానికి లొంగిపోయి, నేడు అమెరికా సామ్రాజ్యవాదం ముందు సాగిలపడుతున్న ఈ శక్తులను ప్రజలు తీవ్రంగా నిరసించాలి. సామ్రాజ్యవాదం, మతతత్వాల అంతిమ లక్ష్యం నరమేధం, కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేయడమనేని మరోసారి ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. నాటి సామ్రాజ్యవాద వ్యతిరేక వారసత్వంతో నేడు అమెరికా-ఇజ్రాయిల్ దురాక్రమణను వ్యతిరేకించాలి. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న అమెరికా లొంగుబాటును నిరసించాలి.

# మన సార్వభౌమాధికారానికే సవాలు




అంతర్జాతీయ న్యాయ సూత్రాలనన్నింటినీ అడ్డగోలుగా ఉల్లంఘిస్తూ సామ్రాజ్యవాదం నేడు మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమాధికారాన్నే రద్దు చేసేంత దాకా పోతోంది. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ మీద బాంబు దాడికి దిగడం దీనినే సూచిస్తోంది. ఇరాన్‌లో అధికారంలో ఉన్నవారిని గద్దె దించి తమకు నచ్చినవారిని ఆ స్థానంలో కూర్చోపెట్టడమే లక్ష్యం అని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించాడు! తమకు ఇబ్బందికరంగా తయారైన ప్రభుత్వాలను కూల్చడానికి కుట్రలు పన్నడం సామ్రాజ్యవాదులకు కొత్తేమీ కాదు. కాకపోతే అటువంటి దేశాలలో సైనిక పరంగా జోక్యం చేసుకోడానికి ఇంతవరకూ వేరే ఏవో సాకులను చూపేవారు. ప్రజాబాహుళ్యాన్ని అంతం చేయగల భయంకర మారణాయుధాలను ఆ దేశం తయారు చేసిందనో, మాదకద్రవ్యాల రవాణా ఆ దేశ ప్రభుత్వమే చేపట్టిందనో-ఇలా సాకులను చూపేవారు. ఇప్పుడు ఇరాన్ మీద దాడికి తెగబడ్డప్పుడు అటువంటి సాకులు చూపే ప్రయత్నం కూడా చెయ్యలేదు. నిజానికి ఇరాన్‌తో ఉన్న వివాదం ఆ దేశం అణ్వాయుధాల తయారీ సామర్థ్యాన్ని పెంపొందించుకుంటోందన్న ఆరోపణ చుట్టూ నడుస్తోంది. ఆ విషయమై ఒకపక్క చర్చలు కూడా కొనసాగుతూనే వున్నాయి. ఆ చర్చల్లో కొంత పురోగతి కూడా సాధించారు. అయినప్పటికీ అవేమీ ఖాతరు చేయకుండా అమెరికా దాడికి దిగింది. వలస పాలనా కాలం అంతమయ్యాక ఒక మూడవ ప్రపంచ దేశపు ప్రభుత్వాన్ని తన ఇష్టం వచ్చిన రీతిలో గద్దె దించివేసే అధికారాన్ని బాహాటంగా తనకు తాను అమెరికా ఆపాదించుకోవడం ఇదే మొదటిసారి ఇరాన్ లోని ఇస్లామిక్ ప్రభుత్వానికి ప్రజా బాహుళ్యపు మద్దతు ఉందా లేదా అన్న విషయం కాని, అది ప్రజలను అణగదొక్కుతున్న ప్రభుత్వమా అన్నది కాని, అక్కడ వాక్‌స్వాతంత్ర్యం ఉందా లేదా అన్నది కాని, ఆ ప్రభుత్వం ప్రతిపక్షాన్ని సహిస్తుందా లేదా అన్నది కాని ఇక్కడ ప్రధానాంశం కాదు. తమను ఈ ప్రభుత్వం పరిపాలించాలా వద్దా అన్న విషయాన్ని తేల్చుకునే హక్కు, అవసరమైతే ప్రభుత్వాన్ని మార్చుకునే హక్కు ఇరాన్ దేశ ప్రజానీకానికి మాత్రమే ఉందన్నది ఇక్కడ ప్రధానాంశం. మరొక దేశపు అంతర్గత వ్యవహారాల్లోకి బలప్రయోగం ద్వారా జోక్యం చేసుకునే హక్కు గాని, పెత్తనం గాని అమెరికన్ సామ్రాజ్యవాదానికి లేదు. ఒక దేశానికి సార్వభౌమాధికారం ఉండడం అంటేనే ఆ దేశ వ్యవహారాలను నిర్ణయించుకునే సంపూర్ణ హక్కు ఆ దేశ ప్రజానీకానికి మాత్రమే ఉండడం. రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో మూడవ ప్రపంచ దేశాలన్నింటిలోనూ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల పర్యవసానంగా అవన్నీ సార్వభౌమాధికారాన్ని సాధించుకున్నాయి. ఇన్నాళ్ళూ సామ్రాజ్యవాదం మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీయడానికి దొడ్డిదారిన అనేక ప్రయత్నాలు సాగిస్తూ వచ్చింది. ఇప్పుడు బహిరంగంగానే సైనిక బలప్రయోగంతో దెబ్బ తీయడానికి సిద్ధమైంది. ఇది దేశాల సార్వభౌవాధికారం మీద ప్రత్యక్ష దాడి. చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి తెర లేచింది. స్వాతంత్ర్య పోరాటాలు సాధించిన విజయాలను తిరగదోడి మూడవ ప్రపంచ దేశాలను మళ్ళీ తమ ఆధీనంలోకి తెచ్చుకోడానికి జరుగుతున్న ప్రయత్నం ఇది. ఇటువంటి దాడికి దిగడానికి సామ్రాజ్యవాదానికి అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఇప్పుడు నెలకొన్న పరిస్థితుల్లో ఈ విధంగా దాడి చేయాల్సిన అవసరం సామ్రాజ్యవాదానికి ఏమొచ్చింది? మొదటి ప్రశ్నకు సమాధానం సూటిగానే లభిస్తుంది.

# ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా వైన్ షాపుల సమయపాలన ఉల్లంఘన..

## ఎక్సయిజ్ అధికారులు చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తాం

## సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి

భద్రాచలం మార్చి 10 నిర్భయ వార్త ప్రతినిధి.. ఏజెన్సీ నియోజకవర్గంలో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్టుషాపు లు అరికట్టాలని, సిండికేట్ దోపిడీని నివారించాలని, ఎమ్మార్పీ ధరలకే మద్య విక్రయాలను జరపాలని, సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి అన్నా రు. ఈ మేరకు ఆయన మంగళవారం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొఫెషనరీ కార్యా లయంలో ఎక్సైజ్ సిబ్బంది శ్రావణి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్నె రవి మాట్లాడుతూ, నియోజకవ ర్గంలో వైన్ షాప్ నిర్వాహకులు సమయ పాలన పాటించకుండా, ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా వైన్ దుకాణాల ను నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు వైన్ వ్యాపారులు ప్రత్య క్షంగా బెల్ట్ షాపులను ప్రోత్స హిస్తున్నార ని మండిపడ్డారు. ఈ షాపులు జనావాసా ల మధ్య స్కూళ్లు దేవాలయాలకు దగ్గర్లో జన సమర్థం ఉన్న ప్రాంతాల్లో పెడుతు న్నారని తెలిపారు. పలు ప్రాంతాలలో మహిళలు, స్థానిక ప్రజలు వీటిని ప్రతిఘ టిస్తున్నారన్నారు. కొత్తగా షాపులు పొంది న వైన్ షాప్ నిర్వాహకులు అడ్డగోలు లాభార్జన కోసం ఇప్పటికే ఇబ్బ డి ముబ్బడిగా అనధికారికంగా బెల్టుషాపులతో ఒప్పందాలు చేసుకుంటున్నారని పేర్కొ న్నారు. బెల్టుషాపుల వల్ల మద్యం వినియోగం పెరగడమే కాకుండా నియంత్రణ లేని మద్యం అమ్మకాలు సాగుతాయని తెలిపారు. జనం అప్పుల పాలవుతు న్నా రని, మహిళలు వేధింపులకు గుర వుతారని, అల్లరి మూకలు పెట్రేగిపోతాయని, అందువల్ల బెల్టుషాపులను ఎక్కడి కక్కడ కట్టడి చేయాలన్నారు. అలాగే ప్రతి వైన్ దుకాణంలో ఆన్లైన్ సేవలైన ఫోన్ పే గూగుల్ పే అందుబాటులో ఉంచే విధం గా చేసే అధికారులు తగు చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు అశ్వాపురం మండలంలో వైన్ షాపుల రూటే సపరేటు అన్న చందంగా తయారైం దనీ, సమయ పాలన పాటించకుండా షాపులను నిర్వ హిస్తున్నారని, నౌకరినా మ నిబంధనలు కూడా పాటించడం లేద న్నారు. ప్రతి షాప్ లో అన్ని రకాల బ్రాండ్ల మద్యాన్ని అందుబాటులో ఉంచాలని ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఫిర్యా దులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వాటిపై కఠినంగా వ్యవహరించాలని ఎక్సైజ్ అధికారులకు ఆయన వివరించారు. తాను చేసిన విజ్ఞప్తి పట్ల ఎక్సైజ్ అధికారు లు సానుకూలంగా స్పందించా రని త్వరలోనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లురవి మీడియాకు తెలిపా రు. సమయపాలన్ని పాటించకుండా వైన్ షాపులు నిర్వహించడంతో పాటు, విని యోగదారులు ప్రతి ఫిర్యాదును ఫోటో తీసి లోకేకషన్ లోకేషన్ ఆధారంగా క్రింది నెంబర్కు ఫిర్యాదులు పంపాలని ఆయన సూచించారు. అలాగే రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ మరియు పిసా చట్టం-- 1996 ప్రకారం షెడ్యూల్ ప్రాంతాల్లో మద్యం దుకాణాల ఏర్పాటు లేదా లైసె న్సుల పునరుద్ధరణకు సంబంధిత గ్రామ సభల తీర్మానం తప్పనిసరి అని ఆయన తెలిపారు. అయితే అశ్వరావుపేట, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, భద్రా చలం, మణుగూరు ప్రాంతాల్లో గ్రామసభల ఆమోదం లేకుండానే వైన్ షాపుల టెండర్లు నిర్వహించారని ఆరోపించారు. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వ +ూ.మీూ.చీశీ.93 ప్రకారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు వైన్ షాపులు తెరిచి ఉండాలని ఉన్నప్ప టికీ అనేక చోట్ల సమయపాలన పాటించడం లేదన్నారు. అశ్వాపురం మండలం లోని శివ సాయి వైన్ షాపు, గొల్లగూడెం గెజిట్ నెంబర్--02 వద్ద ప్రైవేట్ వ్యక్తి ద్వా రా కౌంటర్ నిర్వహించడం వంటి అంశా లు పారదర్శకతను దెబ్బతీస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఐటిడీఏ పీఓ, ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు నిన్ను హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని కర్నే రవి హెచ్చరించారు..



# సీతారామచంద్రస్వామి ప్రాంగణంలో సంగీత సాంస్కృతిక కార్యక్రమం విజయవంతం చేయండి....




భద్రాచలం 10 మార్చి నిర్భయ వార్త ప్రతినిధి. ఈనెల 15వ తేదీ ఆదివారంనాడు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో హైదరాబాదుకు చెందిన శ్రీ వాగ్దేవి కళా సమితి వారు నిర్వహించు నాదోపాసన భక్తి సంగీత సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రిణాలి శ్రేష్ట మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5:30 నుండి 6:30 గంటల వరకు ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి డాక్టర్ శ్రీమతి సింధుజ ద్వారా కూచిపూడి నృత్య ప్రదర్శన, సాయంత్రం 6:30 నుండి 7:00 గంటల వరకు నదీహారతి, 7:00 నుండి ప్రపంచ ప్రఖ్యాత గాత్ర విద్వాంసులు "ప్రియా సిస్టర్"విద్వాన్ శ్రీమతి షణ్ముఖ ప్రియా, శ్రీమతి హనీప్రియ సోదరీమణుల గాత్ర కచేరి జరుగుతున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఐ టి సి, సారపాక, కళ్యాణి గ్రూప్ (భారత్ ఫోర్ జి లిమిటెడ్), పూణే మరియు స్థానిక అధికారుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భక్తులు, సంగీత-సాంస్కృతిక అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పనుల నిర్వీర్యం

### మధ్యాహ్నానికి ఇంటి బాట పడుతున్న కార్యదర్శి సైడ్ డ్రైనేజ్ లో పేరకపోయిన చెత్త చెదారం






సింగరేణి మార్చ్ 10 నిర్భయవార్త రిపోర్టర్.: సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయ పల్లి గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ పనులలో నిర్వీర్యంగా కొనసాగుతున్నాయి. పంచాయతీ కార్యాలయం గేటు తలుపులు మూసి ఉండడం గమనార్హం. ఒకవైపు జిల్లా అధికారులు గ్రామంలో పారిశుధ్య పనులలో నిర్వీర్యం చేయకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని మండల స్థాయి అధికారులకు చెబుతున్నప్పటికీ మండల అధికారులు పనుల పర్యవేక్షణలో నిర్వీర్యమైనప్పటికీ ఉసిరికాయ పల్లి గ్రామపంచాయతీలో సైడ్ డ్రైనేజ్ లో చెత్తా,చెదారం పేరకపోయి నీరు ప్రవాహ మార్గని కి అడ్డుగా తయారైంది. గ్రామ పారిశుద్ధ్య కార్యక్రమాలు శరవేగంగా జరగవలసి ఉండగా నత్తనడక నడవడంతో స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థాయిలో కీలక బాధ్యతలు వహించవలసిన గ్రామ అధికారులు పనులలో నిర్లక్ష్యంగా ఉండడం పై గ్రామ ప్రజల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అధికారి వారి సమయపాలనలో పంచాయతీ అభివృద్ధికి అందుబాటులో ఉండాలని పలువురు కోరారు.

# ఏసీ బస్సుల్లో 20-30 శాతం రాయితీ




హైదరాబాద్ మార్చి 10 నిర్భయ వార్త ప్రతినిధి వేసవికాలం గ్రేటర్ ప్రయాణికులకు 20-30 శాతం రాయుతీతో ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు సేవలు అందించనుంది. ఈ మేరకు గ్రేటర్ ఆర్టీసీ చర్యలు చేపట్టింది. మార్చి, ఏప్రిల్, మే మూడు నెలలు టికెట్ చార్జీలపై రాయితీని అందిస్తూ ప్రయాణికుల ఆక్యుపెన్సీ పెంచేదిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణంగా 60శాతం నమోదయ్యే ప్రయాణికుల ఆక్యుపెన్సీని వేసవిలో 90-100 శాతం పెంచాలని ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఎయిర్పోర్టు రూట్లో ఆర్టీసీ నడుపుతున్న 50 పుష్పక్ బస్సులు, నగర పరిధిలో 40 ఏసీ బస్సుల్లో రాయితీని వర్తింపజేస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ఏడాది చివరినాటికి గ్రేటర్జోన్కు కొత్తగా మరో 170 ఈవీ బస్సులు తీసుకువచ్చే దిశగా ఆర్టీసీ ప్రయత్నాలు చేస్తోంది.

# ఐటీడీఏ కి సంబంధించిన ఫైళ్లు భద్రపరిచిన అధికారులు...





భద్రాచలం 10 మార్చి నిర్భయ వార్త ప్రతినిధి.. ప్రజా పాలన ప్రభుత్వ ప్రణాళికలో భాగంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ఆదేశాల మేరకు ఐటీడీఏ కార్యాలయంలోని వివిధ విభాగాలలో ఉన్న పాత ఫైళ్ల మరియు ప్రస్తుతం వాడకంలో లేని ఫైళ్లను గుర్తించి రికార్డు రూములో భద్రపరచడం జరిగిందని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. మంగళవారం ప్రగతి పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ మేనేజర్ ఆదినారాయణ సారథ్యంలో ఐటిడిఏ కార్యాలయంలోని వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ద్వారా అడ్మిన్ వ్యవస్థాపన, మోటార్ వెహికల్, డీజిల్, మరమ్మత్తులు, కోర్టు కేసులు, ఎల్ టి ఆర్ కేసులు, ఆర్టిఐ, ఆర్ ఓ ఎఫ్ ఆర్, మిసిలేనియన్స్, అసిస్టెంట్ ఐటిడిఏ, లెక్కల విభాగం, వ్యవసాయం, విద్యుత్ శాఖ, ఉద్యానవన శాఖ, మత్స్యశాఖ, ఈజీఎస్, కొండ రెడ్ల విభాగాలకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డు రూములో భద్రపరచడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, అడ్మిన్ శ్రీనివాస్, సిబ్బంది సాయిచంద్, సూపల్, చలపతి, లక్ష్మయ్య, కళ్యాణ్, కార్తీక్, అనిత, భావన, జానీ, సుజాత,తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికళ్యాణమహోత్సవం



చర్ల మార్చి 10 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం లక్ష్మీ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని జాంబవంతుడి గుట్టలపై వెలసిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మతల్లిఆలయంలో నేడు భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగాకళ్యాణమహోత్సవంవైభవంగా జరిగింది. మహిమాన్వితశక్తిగా. భక్తుల కోరికలను తీర్చే అమ్మలగన్న అమ్మగా ప్రసిద్ధి చెందిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికళ్యాణాన్ని ప్రతిసంవత్సరంసంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా గిరిజన పూజారులు, గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారంఅంగరంగ వైభవంగా కళ్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు, డప్పువాయిద్యాల నడుమ కన్నుల పండుగగా అమ్మవారి కళ్యాణ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయపరిసరప్రాంతం భక్తులతోనిండింది. ఈకళ్యాణ మహోత్సవానికి చర్ల మండలంతోపాటుసమీపప్రాంతాలైన గ్రామాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులుతీర్చుకున్నారు. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణానికి చర్ల వాస్తవ్యులుఆర్.ఎస్ కిరాణా శ్రీను దంపతులుఅమ్మవారికి పట్టువస్త్రాలు. పసుపు. కుంకుమ. పూలుపళ్ళుసమర్పించారు,రేణుకఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం వందలాది మంది భక్తులసమక్షంలో ఎంతో వైభవంగా జరిగింది,వచ్చిన భక్తులకు,ఆర్ఎస్ కిరాణా శ్రీనుఅన్నప్రసాదనఏర్పాటుచేశారు,తీర్థప్రసాదాలు కూడాఏర్పాటుచేసినట్లు ఆలయకమిటీసభ్యులు తెలిపారు. ఈసందర్భంగాఆలయనిర్వాహకులుమాట్లాడుతూ. అధిక సంఖ్యలో భక్తులు భక్తి శ్రద్ధలతోపాల్గొనికార్యక్రమాన్నివిజయవంతంచేశారు.


# బాలమేళాలో జిల్లా ప్రథమ స్థానం కైవసం చేసుకున్న నరసాపురం కాంప్లెక్స్ పాఠశాల...






దుమ్ముగూడెం మార్చ్ 10 నిర్భయ వార్త ప్రతినిధి తెలంగాణలో తొలిసారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్య సంబంధిత గ్రంథాలయం అంశాలపై నిర్వహించిన పోటీలలో నర్సాపురం కాంప్లెక్స్ కు చెందిన కే దంతన పాఠశాల కు కు చెందిన వీ. కనిష్క్ ఒకటో తరగతి విద్యార్థి మొదటి స్థానాన్నికైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మొదటి స్థానం కైవసం చేసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుని కృషికి విజయం సాధించిన విద్యార్థికి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు..

# మల్లాది సుబ్బమ్మ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ కళాశాలకు కంప్యూటర్ వితరణ



సింగరేణి మార్చి 10 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మల్లాది సుబ్బమ్మ ట్రస్ట్ ద్వారా మల్లాది కార్తీక్ 20వేల రూపాయల విలువ గల కంప్యూటర్ విద్యార్థుల శ్రేయస్సు కోసం అందజేశారు. ఈ కంప్యూటర్ను పర్సా పట్టాభి రామారావు, విజయలక్ష్మి దంపతులు కళాశాల ప్రిన్సిపాల్ కు అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక టెక్నాలజీలో కంప్యూటర్ పరిజ్ఞానం జరిగింది అని విద్యార్థులు అవసరం కోసం కంప్యూటర్ అందజేయడం జరిగింది అని విద్యార్థులు ఏ అవకాశాన్ని సన్నిధిగా చేసుకోవాలని దాతలు కోరారు. అనంతరం ప్రిన్సిపాల్ దాతలను శాల్లోతో సత్కరించి వారి సేవలను కొనియాడారు.

# పి ఆర్ టి యు సంఘమే ఉపాధ్యాయులకు కొండంత అండ

**శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి**



మిర్యాలగూడ నిర్భయవార్త ప్రతినిధి : పి ఆర్ టి యు టి ఎస్ మిర్యాలగూడ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కురియ తండా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ నేడు ఉద్యోగ విరమణ చేసిన శ్రీ మేకల సత్యనారాయణ రెడ్డి అభినందన సన్మాన సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు శ్రీ పింగిలి శ్రీపాల్ రెడ్డి హాజరై.మాట్లాడారు .ఉపాధ్యాయుల సంక్షేమం కోసం 1971 నుండి ఇప్పటి వరకు పి ఆర్ టి యు సంఘం ఒక బాధ్యతగా ఉపాధ్యాయుల హక్కులను కాపాడుతూ వారికి ఎల్లప్పుడూ కొండంత అండగా ఉన్నదని ,ఎన్నో జీవోలు ముఖ్యమంత్రుల ద్వారా ఇప్పించిన ఘనత పి ఆర్ టి యు సంఘానిదేనని తెలిపారు. ,అలాగే మోడల్ స్కూల్ గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇప్పించే బాధ్యత పి ఆర్ టి యు సంఘానిదేనని.. సిపిఎస్ రద్దు చేసే వరకు విశ్రమించేది లేదని, జీవో నెంబర్ 25 రేషనలైజేషన్ సవరించి వేసవి సెలవులలోనే పదోన్నతులతో కూడిన బదిలీలను చేపట్టేలా ముఖ్యమంత్రిని ఒప్పించడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర బిక్షం గౌడ్, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి మేకల జానారెడ్డి ,రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ మెంబర్ పాదూరి యాదగిరి రెడ్డి, బాధ్యులు జి అనురాధ ,జి. వింద్య తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రి బాయి పూలే 129.వ వర్ధంతి సందర్భంగా బీసీ జేఏసీ ఘనమైన నివాళులు

**బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్**



మిర్యాలగూడ మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి : పదవ తరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థినిలకు సావిత్రి భాయ్ పూలే 129.వ వర్ధంతి సందర్భంగా పరీక్ష ప్యాడ్స్, పెన్స్ సామాగ్రి పంపిణి చేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ చదువుల తల్లి సావిత్రి బాయి పూలే ఆశయ సాధన కొరకు ఎక్కడైతే అణచివేత గురైనారో -అక్కడ చదువుతూ సమాధానం చెప్పాలన్నారు.సాంఘిక సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన శ్రీ సావిత్రి బాయి పూలే 129.వ వర్ధంతి సందర్భంగా బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ స్థానిక మిర్యాలగూడ పట్టణంలో బీసీ బాలికల వసతి గృహంలో మంగళవారం రోజున నిర్వహించిన సావిత్రి భాయి పూలే 129.వ వర్ధంతి సందర్భంగాబీసీ బాలికల వసతి గృహ బాలికలకు రేపు జరగబోయే పదవతరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థినిలకు పరీక్ష ప్యాడ్స్, పెన్స్ పంపిణి చేయడం జరిగిందివారు భవిష్యత్తు లో మంచి స్థాయికి చేరుకోవాలి అని అన్నారు అంతేకాకుండా బీసీ జేఏసీ నాయకులు, మహిళా సంఘం నాయకులు కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. సావిత్రిబాయి చేసిన త్యాగం మరువలేనిదని. పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య రజక, బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్ ముదిరాజ్, బీసీ మహిళా సంఘం మిర్యాలగూడ నియోజకవర్గం అధ్యక్షురాలు సందేనా బోయిన జయమ్మ, బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరికుంట్ల సుధాకర్ రజక,బీసీ మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు మండలి సావిత్రి,బీసీ యువజన సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దారుణం.. భార్యను రోకలి బండతో కొట్టి చంపిన భర్త

వరంగల్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి : వరంగల్ నగరం 14వ డివిజన్ ఎస్ఆర్ నగర్‌లో దారుణ సంఘటన చోటు చేసుకుంది. అబ్బరబోయిన రాజు అనే వ్యక్తి మద్యం మత్తులో తన భార్య అనిత(40) పై దాడి చేసి చంపిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. అనిత తన బాబాయి కర్మకాండకు వెళ్లి ఇంటికి వచ్చింది. ఆ సమయంలో రాజు మద్యం సేవించి ఉన్నాడు. ఇద్దరి మధ్య గొడవ జరగడంతో రాజు క్షణికావేశంతో అక్కడే ఉన్న రోకలితో అనిత తలపై బలంగా కొట్టాడు. దాంతో అనిత అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతున్న విషయం గమనించి స్థానికులు ఇంట్లోకి రాగా అప్పటికే తీవ్ర రక్తస్రావంతో అనిత కిందపడి ఉంది. వెంటనే స్థానికులు ఆమెను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెను బతికించాలని శ్రమించినప్పటికీ, తీవ్ర రక్తస్రావం కావడంతో అనిత చికిత్స పొందుతూ కన్నుమూసింది. ఈ ఘటనపై ఇంతేజార్ గంజ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# గుట్టకిందగుంపులో ప్రగతి ప్రణాళికా కార్యాచరణ

**పరిశుభ్రతలో పనిముట్లు పట్టిన సర్పంచ్, కార్యదర్శి**





సింగరేణి మార్చి 10 నిర్భయవార్త రిపోర్టర్. : సింగరేణి మండల పరిధిలోని గుట్టకింది గుంపులో ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళ వారం సర్పంచ్ ఉండం రాఘవు లు, గ్రామ కార్యదర్శి నారాయణ రావు వీధుల్లో తిరుగుతూ పలు సమస్యలను గుర్తించి, ప్రజలను అడిగి తెలుసుకొని గ్రామ పారిశు ద్ధ్య పనులలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులను సర్పంచ్, స్వయంగా పలుగు, పారా పట్టి పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ అవసరాలను అభివృద్ధిని ప్రగతి ప్రణాళికలో నిర్వహించుకుందామన్నారు. ప్రజల అభీష్టం మేరకు గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయింపు జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎండి పర్వీన్ , పంచాయతీ కార్యదర్శి నారాయణరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు విశ్వవిద్యాలయంలో జర్నలిజం విద్యార్థుల శ్రమదానం

**ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం**



హైదరాబాద్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీలో సామాజిక బాధ్యతలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులు శ్రమదానం చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పేరుతో తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన "99 రోజుల కార్యాచరణ ప్రణాళిక" లో యూనివర్సిటీ కూడా భాగస్వామ్యమైంది. వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు పర్యవేక్షణలో, నోడల్ అధికారి ఆచార్య బీహెచ్. పద్మ ప్రియ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. దీనిలో భాగంగా, తెలుగు విశ్వవిద్యాలయం బాలుర హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. భవన ప్రాంగణాలను, తరగతి గదులను కూడా శుభ్రపరిచారు. ఈ సందర్భంగా పద్మప్రియ మాట్లాడుతూ హాస్టల్ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. వర్సిటీలో స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. రత్నశ్రీ, డా. రాధ, జర్నలిజం అధ్యాపకులు డా. షేక్ హసీనా, డా. షేక్ సమీర్, డా.వెంకటేశ్వర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో 2 కే రన్ కార్యక్రమం..

**2 కే రన్ ను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి..**

**స్థానిక రాజీవ్ చౌక్ నుండి హనుమాన్ పేట ఫ్లైఓవర్ వరకు కొనసాగిన 2 కే రన్..**



మిర్యాలగూడ మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి : మిర్యాలగూడ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా. మిర్యాలగూడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చెత్తరహిత మిర్యాలగూడగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపు. పరిసరాల పరిశుభ్రత,పచ్చదనం పెంపొందించడం తమ లక్ష్యం.వచ్చే రెండేళ్లలో మిర్యాలగూడ పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసుకుంటాం..ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ పాల్గొన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ చౌక్ నుండి ఫ్లైఓవర్ వరకు 2కే రన్ నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది కౌన్సిలర్స్ పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు..






# శివాలయం గుడికి పంచాంగాల బహుకరణ.



సింగరేణి మార్చి 10 నిర్భయవార్త రిపోర్టర్.కారేపల్లి,కామేపల్లి,గార్ల , రఘునాధపాలెం మండలాల పురోహితులకు సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి పంచాంగాలను బహుకరించారు. కారేపల్లి శివాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విజయ విఘ్నేశ్వర అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు కొత్తలంక కైలాస్ శర్మ కు సురేందర్ రెడ్డి ఈ పంచాంగాలను అందించారు.ఈ సందర్భంగా కొత్తలంక కైలాష్ శర్మ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా పురోహితులకు సురేందర్ రెడ్డి పంచాంగాలను బహుకరించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో పురోహిత సంఘం ఉపాధ్యక్షులు వెలవలపల్లి వెంకట సురేష్ శర్మ,కోశాధికారి కొండపల్లి శ్రీనివాస్ వర్మ ,తుంగతుర్తి రామకృష్ణ శర్మ, రామరాజు ఉదయ్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆరో సేతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లు పంపిణీ







మల్లాపూర్ నిర్భయ వార్త ప్రతినిధి మార్చి10:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉప్పల్ నియోజకవర్గ మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. హైదరాబాద్ మల్లాపూర్ లో ఆరో సేతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ సఖి థీమ్ తో మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 300 మంది విద్యార్థులకు హై జెనిక్ కిడ్స్ మరియు ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టూడెంట్ ఎన్జీవో ఫౌండర్ విష్ణు వికాస్ మాట్లాడుతూ ప్రత్యూష ఫౌండేషన్ సహాయంతో స్టూడెంట్ ఎన్జీవోస్ సహకారంతో విద్యార్థులకు మా వంతుగా ఇలాంటి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ విష్ణు వికాస్, కోఫౌండర్ జనరల్ సెక్రెటరీ అక్షిత పటేల్, వైస్ ప్రెసిడెంట్ నికిత తదితరులు పాల్గొన్నారు.

# 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో సైబర్ సెక్యూరిటీ దాడులు

హైదరాబాద్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి : రోజురోజుకీ పెరుగుతున్న సైబర్? దోపిడీలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ సైబర్? క్రైం పోలీసులు? ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సైబర్? నేరాల నెట్‌వర్క్‌ను ఛేదించడమే లక్ష్యంగా 'ఆపరేషన్? క్రాక్‌డౌన్ 1.0?' పేరిట ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0 పేరుతో పోలీసులు సైబర్ సెక్యూరిటీ దాడులు నిర్వహించారు. సైబర్ మోసాలకు సహకరిస్తున్న మ్యూల్ బ్యాంక్ ఖాతాల నెట్‌వర్క్‌లపై చర్యలు చేపట్టారు. 512 మంది సిబ్బందితో 137 పోలీసు బృందాలు ఏకకాలంలో సైబర్ సెక్యూరిటీ దాడులు జరిపాయి. రాష్ట్రవ్యాప్తంగా 137 బ్యాంక్ శాఖల్లో ఆకస్మిక తనిఖీలు చేసిన పోలీసులు, దేశవ్యాప్తంగా 9,451 సైబర్ నేరాలకు లింక్ ఉన్న 1,888 ఖాతాలు గుర్తించారు. ఈ ఖాతాల ద్వారా సుమారు రూ.100 కోట్ల నష్టం జరిగినట్లు సైబర్ పోలీసులు గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో 549 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అలానే 626 మంది అనుమానితులు గుర్తించి.. అందులో 208 మందిని అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో 15 మహిళలు, 7 విద్యార్థులు, ఇద్దరు లెక్చరర్లు, ఒక ప్రభుత్వ ఉద్యోగి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉన్నారు. వీరి ఖాతాలను అద్దెకు తీసుకుని, ప్రతి ట్రాన్సాక్షన్‌పై 5 శాతం కమిషన్ సైబర్ క్రైమ్ ముఠా ఇస్తున్నాయి. ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0లో 208 బ్యాంక్ పాస్‌బుక్‌లు, చెక్ బుక్‌లు సీజ్ చేశారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జూబ్లీహిల్స్ మర్చంట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగులు అరెస్టయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా ఖాతాలు తెరవడంలో బ్యాంక్ అధికారులు సహకరిస్తున్నారు. అలాంటి ఉద్యోగులపై బీఎన్ఎస్ సెక్షన్-112ను పోలీసులు ప్రయోగించారు.

# డాక్టర్ నమత్ర ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ




హైదరాబాద్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి : సృష్టి సరోగసీ అక్రమాల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడుగా ముందుకు వెళ్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. దాదాపు రూ. 50 కోట్ల ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ అధికారులు మంగళవారం ప్రకటించారు. సృష్టి కేసులో సీసీఎస్ పోలీసుల విచారణ తర్వాత.. ఈడీ కూడా ఈసీఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టింది. సృష్టి కేసులో డాక్టర్ నమ్రతను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం తమ కస్టడీకి నమ్రతను ఇవ్వాలంటూ సీసీఎస్ పోలీసులను ఈడీ అధికారులు కోరారు. ఆ క్రమంలో రెండు రోజుల పాటు డాక్టర్ నమ్రతను విచారించిన ఈడీ అధికారులు.. పలు కీలక విషయాలను రాబట్టారు. దీంతో రూ. 50 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేస్తూ ఈడీ అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. 2014 నుంచి సరోగసీ అక్రమాలకు ఆమె పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించారు. అలాగే నమ్రతపై సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్.. దర్యాప్తు నివేదిక ఆధారంగా చేసుకుని ఈడీ దూకుడు పెంచింది. అంతేకాకుండా.. ఈ కేసులో మనీలాండరింగ్ కూడా ఉందని ఈడీ భావిస్తోంది. ముఖ్యంగా పిల్లలు లేని తల్లిదండ్రులకు సరోగసీ పేరు చెప్పి భారీగా రూ. లక్షల్లో నగదు వసూలు చేసి మోసం చేసినట్లు ఈ దర్యాప్తులో గుర్తించారు. ఇక గిరిజన తండాల్లోని పిల్లలను కొనుగోలు చేసి.. విక్రయించినట్లు తెలుస్తోంది. సరోగసీ ద్వారా కోట్లాది రూపాయిలను డాక్టర్ నమ్రతా సంపాదించినట్లు ఈడీ గుర్తించింది. ఈ నగదునంతా విదేశాలకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోంది. అందులో భాగంగానే రూ. 50 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేయాలని ఈడీ అధికారులు నిర్ణయించారు. దీంతో డాక్టర్ నమ్రతకు చెందిన మొత్తం 50 స్థిరాస్తులను ఈడీ అధికారులు సీజ్ చేశారు. భూములు, ఫ్లాట్లు, ఆసుపత్రి సహా పలు ఆస్తులను అటాచ్ చేశారు. వీటి మార్కెట్ విలువ సుమారు రూ.50 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. ఈ కేసు దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. పేద గర్భిణీలను నగదుతో ప్రలోభపెట్టి పిల్లలను కొనుగోలు చేసినట్లు కనుగొన్నారు. ఆడపిల్లకు రూ. 3.5 లక్షలు, మగపిల్లవానికి రూ 4.5 లక్షలు చెల్లించారు. జనన రికార్డుల్లో తల్లిదండ్రుల పేర్లు సైతం ఫోర్జరీ చేసినట్లు గుర్తించినట్లు సమాచారం.

# ఆ సారా తాగితే ఆరోగ్యం.. ప్రభుత్వానికి రూ.

## లక్ష కోట్ల ఆదాయం.. ఎమ్మెల్యే వ్యాఖ్యలు



మహబూబ్‌నగర్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి :రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఇప్ప పువ్వు సారా గురించి చర్చిస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జడ్చర్లలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ఇప్ప పువ్వు సారాకు 5,000 ఏళ్ల చరిత్ర ఉందని గుర్తు చేశారు. అది పూర్తిగా ఆరోగ్యకరమైన ఆర్గానిక్ అని తెలిపారు. ఇప్ప పువ్వు సారా తయారీ వల్ల రాష్ట్రానికి కోట్ల రూపాయిలలో ఆదాయం వస్తుందని వెల్లడించారు. దీనిని ప్రతిపక్ష పార్టీల వారు సైతం అభినందిస్తారని అన్నారు. గతంలో ఇప్ప పువ్వు సార తాగిన వాళ్లు 115 ఏళ్లు బతికారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కల్తీ బ్రాండ్ల తాగిన వారు కేవలం 60 ఏళ్ళు మాత్రమే బతుకుతున్నారని చెప్పారు. విదేశాలలో అనేక కల్తీ బ్రాండ్లు ఉన్నాయని.. వాటికి మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్టీ సోదరులు ఆర్థికంగా ఎదగాలంటే ఇప్ప పువ్వు సారాకు ప్రాధాన్యత కల్పించాలని తాను ప్రభుత్వాన్ని కోరతానని అన్నారు. తెలంగాణలో ఇప్ప పువ్వు సారతో రూ. లక్ష కోట్ల రెవెన్యూ వచ్చే విధంగా మార్కెట్ ఎక్స్‌పోర్ట్ కూడా చేయవచ్చని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వివరించారు. మరోవైపు సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విలేకర్లతో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈసారి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సారా దుకాణాలు ప్రారంభించాలని ప్రభుత్వానికి అసెంబ్లీలో విజ్ఞప్తి చేస్తానన్నారు. ఇప్ప పువ్వు సారా సైన్టిఫిక్‌గా ఆరోగ్యానికి హానికరం కాదని పేర్కొన్నారు. ఇటీవల కొన్ని రాష్టాల్లో సైతం సారా దుకాణాలు ప్రారంభించారని గుర్తు చేశారు. అస్సలు తెలంగాణ రాష్టంలో ఎందుకు సారా దుకాణాలు బంద్ చేశారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉ ందన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో సారా దుకాణాల అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తుతానని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.

# పార్టీ మార్పు ప్రచారంపై జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు!



జగిత్యాల, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి :కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ మార్పుపై పలు కీలక వ్యాఖ్యలు చేయడంతో జగిత్యాలలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కాంగ్రెస్ పార్టీలో కొనసాగడంపై పునరాలోచనలో ఉన్నానని, అవమానాలు ఇంకెంత కాలం భరించాలని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమయం, సందర్భం వచ్చినపుడు నిర్ణయం తీసుకుంటానని, మంగళవారం జగిత్యాల కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. ఇటీవల పార్టీ మారుతున్నారన్న ప్రచారంపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఏ అంశమైనా మీకు తెలియకుండా జరగదు, మున్సిపల్ ఎన్నికల ఫలితాల రోజే ఇక్కడ పరిస్థితి గురించి చెప్పాను, భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీలో కొనసాగాలా? వద్దా అన్న నిర్ణయం త్వరలో చెబుతా అన్నారు. పార్టీ మార్పుపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నేను ఏ నిర్ణయం తీసుకున్నా, కార్యకర్తలకు సంప్రదించి మీడియా ద్వారానే వెల్లడిస్తానని అన్నారు. ఇదిలా ఉంటే.. గత కొంత కాలంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ (బీఆర్ఎస్ నుంచి వచ్చినవారు)కు ప్రాధాన్యత ఇవ్వడం, మున్సిపల్ ఎన్నికల పరిణామాలపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తనను సంప్రదించారని వార్తలు వచ్చిన నేపథ్యంలో, ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# పాఠశాల వదిలి పోతున్నామని కన్నీరు మున్నీరుగా విలపించిన విద్యార్థులు

## చెన్నయ్యపాలెం జడ్పీ స్కూల్లో వీడ్కోలు సమావేశం





మిర్యాలగూడ మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి :విద్యార్థులకు పాఠశాల దశ కీలకమైంది కాగా పదో తరగతి పూర్తి కావడంతో పాఠశాల దశ ముగిసినట్లు అయింది. దీంతో తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు పాఠశాలను వదిలి పోతున్నామని కన్నీరు మున్నీరుగా విలపిస్తూ. పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలు గుర్తు చేస్తూ ఒకరినొకరు విలపిస్తూ బాధను వ్యక్తం చేశారు. వారిని ఓదార్చడం 9వ తరగతి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల వంతు అయింది .ఈ సంఘటన సోమవారం త్రిపురారం మండలంలోని చెన్నాయపాలెం ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. కార్యక్రమానికి మండల విద్యాధికారి రామవత్ రవి నాయక్ హాజరై మాట్లాడుతూ పాఠశాల దశ కీలకమైందని నేర్చుకున్న చదువు, క్రమశిక్షణ కళాశాల స్థాయిలో ఉపయోగపడుతుందని అన్నారు. తమకు ఇష్టమైన కోర్సులను ఎంచుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు. ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైదిరెడ్డి ఉపాధ్యాయులు సత్యనారాయణ సైదయ్య నరసింహస్వామి లక్ష్మీ మాలోతు దశరథ నాయక్ శ్రీనివాస్ విజయలక్ష్మి నరేందర్ ఝాన్సీ లలిత మమత తిరుపతమ్మ రాము తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ జమ్మలమడుగు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు..

### మహిళ ఒక వ్యక్తిగా కాకుండా అన్ని రంగాల్లో ఒక శక్తిగా రాణించాలి..

### వివిధ రంగాల్లో పనిచేస్తున్న 50 మంది మహిళా అధికారులకు ఘన సన్మానం

### రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి..






జమ్మలమడుగు మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి : కడపజిల్లా జమ్మలమడుగు పట్టణంలోని ఆర్ డి ఓ కార్యాలయంలోని సభాభవనంలో రోటరీ క్లబ్ జమ్మలమడుగు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని మహిళా అధికారిణుల సమక్షంలో ఘనంగా మహిళ దినోత్సవం వేడుకలను జరిపినట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మరియు కార్యదర్శి ఏ. సంజీవ రాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవము గురించి, ప్రాముఖ్యత గురించి, మహిళ గొప్పతనం గురించి పలువురు వక్తలు కొనియాడారు, ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఐపిడిజి సాధు గోపాల క్రిష్ణ మాట్లాడుతూ....మహిళ గొప్పతనం గురించి కొనియాడారు. మహిళా మాతృమూర్తుల గురించి ప్రసంగించారు. తదుపరి రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కె.వి.మురళీ ధర రెడ్డి మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. మహిళల గొప్పతనాన్ని వారి సేవలను కొనియాడారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో మహిళ అంటే ఒక వ్యక్తి కాదు శక్తి అని నిరూపిస్తున్నారు అని కొనియాడారు. అందుకే ఈ రోజు రోటరీ క్లబ్ తరుపున వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళా అధికారిణులను ఘనముగా సన్మాన కార్యక్రమము చేయడం జరుగుతుందన్నారు. తదుపరి ఈ కార్యక్రమంలో మహిళా అధికారుణులు అయిన ఎక్సైజ్ సీఐ బి.సరితారెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నిసా, ఎపియస్ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట సుబ్బమ్మ, మహిళా డాక్టర్స్ డాక్టరు చంద్రకళ, డాక్టర్ విజయ లక్ష్మి, డాక్టర్ శిల్పా రవి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ లిఖిత, డాక్టర్ ఆశ, రోటరీ మెంబర్ చరణ కుమారి ఐసిడియస్ సీడీ పిఓ జయమ్మ, బాలికల కళాశాల వార్డెన్ మనో రాణి మరియు గవర్నమెంట్ హాస్పిటల్ లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సు లను సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ పెద్దలు ,సభ్యులు కుండా భాస్కర్, పి.నాగేశ్వర రెడ్డి, రంగేశ్వర రెడ్డి, రఫీ భాష, ఓబుల రెడ్డి, డాక్టర్ రఫిక్ బాష, డాక్టర్ సూర్య నారాయణరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ వద్ద ఇరు వర్గాలు బాహాబాహి..

## రంగంలోకి దిగిన పోలీసులు




సంగారెడ్డి, మార్చి 10: పోలీస్ స్టేషన్‌లోనే ఇరు వర్గాలు బాహాబాహీకి దిగిన ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. ఇరు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో వారికి గాయాలయ్యాయి. కొంతకాలంగా దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దాంతో ఆ భార్య భర్తలు విడివిడిగా నివసిస్తున్నారు. తన భర్త కొడుతున్నారంటూ భార్య జ్యోతి తుప్రాన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. తన భార్యను ఇంటికి పంపాలంటూ జ్యోతి భర్త ఉ దయ కిరణ్ మంగళవారం ఘర్షణకు దిగాడు. దీంతో ఇరు కుటుంబాల సభ్యుల మధ్య మాటా మాటా పెరిగి.. ఈ ఘర్షణకు దారి తీసింది. తూప్రాన్ మండలం అల్లాపురానికి చెందిన జ్యోతికి, చేగుంట మండలం రాంపూర్‌కు చెందిన ఉదయ్ కిరణ్‌లకు గతంలో వివాహమైంది. నాటి నుంచి ఈ దంపతుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తాయి. దాంతో పలుమార్లు పెద్దలు పంచాయతీ పెట్టి.. దంపతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. భార్యాభర్తలకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. దీంతో వీరితో పాటు ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు సైతం పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చారు. ఆ క్రమంలో పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఇరు వర్గాల మధ్య మాటా మాటా పెరిగింది. దీంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. వారిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న పలువురికి ఏం జరుగుతుందో తొలుత అర్థం కాని పరిస్థితి నెలకొంది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి లాఠీ చార్జి చేశారు. ఈ ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం వారిని అక్కడి నుంచి పంపేశారు.




# క్రెడిట్ ట్రాప్‌లో.. జెన్‌జీ!

## లగ్జరీ లైఫ్ కోసం అప్పులు

- జీతం ₹30 వేలు.. అప్పులు ₹40 లక్షలు?
- రుణ ఉచ్చులో నేటితరం యువత
- స్మార్ట్‌ఫోన్‌తోనే రుణ మాయాజాలం
- క్రెడిట్ కార్డులను తెగ వాడేస్తున్నారు
- అవసరానికి మించిన ఖర్చులు
- ఆడంబరమైన జీవితం కోసం తిప్పలు
- తెలియకుండానే అప్పుల ఊబిలోకి
- అప్పు తీర్చేందుకు మరో అప్పు

నేటి ఉరుకులు పరుగుల ఆధునిక కాలంలో జెన్-జీ (Gen-Z)గా పిలిచే యువత సరికొత్త జీవనశైలిని అలవర్చుకుంటోంది. లగ్జరీ లైఫ్ ఎంజాయ్ చేయాలి అనుకుంటోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇన్‌స్టాంట్‌గా పనులు జరిగిపోవాలని భావిస్తోంది. దీంతో అవసరానికి మించి ఖర్చు చేయడం వారికి ఒక వ్యసనంగా మారుతోంది. కేవలం ₹30,000 జీతం ఉన్న యువతీ, యువకులు లక్షల రూపాయల లోన్లు తీసుకుని తెలియకుండానే అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. తెలియకుండానే ఈ సమస్య చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఆడంబరమైన జీవితం కోసం చేసే అప్పులు చివరికి తీర్చుకోలేని అప్పుల భారంలోకి నెట్టివేస్తున్నాయి.

## అప్పు తీర్చేందుకు మరో అప్పు..



హైదరాబాద్‌కు చెందిన 24 ఏళ్ల యువకుడు ₹30వేల జీతంతో ఉద్యోగం చేస్తున్నాడు. మొదట ఒక క్రెడిట్ కార్డ్ తీసుకున్నాడు. ఆ తర్వాత కొత్త ఐఫోన్ కోసం ఈఎంఐ, వీకెండ్ పార్టీల కోసం పర్సనల్ లోన్లు తీసుకున్నాడు. ఆన్‌లైన్ లోన్ యాప్స్, బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు చాలా ఈజీగా ఎలాంటి తనఖా లేకుండా రుణాలు ఇవ్వడంతో తెలియకుండానే రుణ ఉచ్చులో కూరుకుపోయాడు. ఒక అప్పు తీర్చేందుకు మరో అప్పు.. విలాసవంతమైన జీవితం కోసం క్షణాల్లో మంజూరయ్యే ఆన్‌లైన్ రుణాలు తీసుకుంటూ చూస్తూ ఉండగానే అతని మొత్తం అప్పు ₹40 లక్షలకు చేరింది. నెలవారీ ఈఎంఐలు అతనికి వచ్చే జీతం కంటే మూడు రెట్లు ఎక్కువగా మారిపోయాయి. ఒక అప్పు తీర్చడానికి మరో అప్పు చేస్తూ చివరకు చిక్కుల్లో పడిపోయాడు. అయితే.. ఇది ఈ ఒక్క యువకుడి సమస్య మాత్రమే కాదు.. నేటితరం యువత ఏ విధంగా ప్రమాదకరమైన అప్పుల ఉచ్చులో చిక్కుకుంటున్నారో ఈ ఒక్క ఉదాహరణ చూస్తే అర్థమవుతుంది.

ఆర్థిక పరిస్థితి చేజారిపోతోందని చెప్పడానికి ఈ ఏడు సంకేతాలే నిదర్శనంగా ఉంటాయని ఆర్థిక, మానసిక రంగ నిపుణులు చెబుతున్నారు

### ప్రమాదంలో ఉన్నారని చెప్పే సూచికలు

- నెల జీతం పడగానే క్రెడిట్ కార్డ్ బిల్లులు, ఈఎంఐలకే సరిపోతుంటే మీరు ప్రమాదంలో ఉన్నట్లే.
- క్రెడిట్ కార్డ్ బిల్లు పూర్తిగా కట్టలేక కేవలం మినిమం డ్యూ మాత్రమే కడుతున్నారంటే చక్రవడ్డీ ఊబిలోకి వెళ్తున్నారని అర్థం.
- ఒక అప్పు కట్టడానికి మరో క్రెడిట్ కార్డ్ లేదా యాప్ నుంచి లోన్ తీసుకోవడం అత్యంత ప్రమాదకరం.
- ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే అప్పు చేయక తప్పని స్థితిలో ఉండటం.
- మీ దగ్గరున్న అన్ని క్రెడిట్ కార్డుల లిమిట్ వాడేయడం.
- గడువు తేదీలు దాటిపోయినా బిల్లులు కట్టలేకపోవడం.
- అప్పుల గురించి ఆలోచిస్తూ నిద్ర పట్టకపోవడం లేదా పనిపై ఏకాగ్రత దెబ్బతినడం.

## పరిష్కారం ఏమిటంటే..

ఆర్థిక నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం.. యువత తమ నికర ఆదాయంలో 30% నుంచి 40% కంటే ఎక్కువ ఈఎంఐలు ఉంచుకోకూడదు. క్రెడిట్ కార్డులను కేవలం అత్యవసరాలకే ఉపయోగించాలి. అవసరాలు, కోరికలు మధ్య తేడాను గుర్తించగలగాలి. ఇలా చేసినప్పుడే అప్పుల ఉచ్చు నుంచి బయటపడటం సాధ్యమవుతుంది. అప్పు అనేది రెండు వైపుల పదును ఉండే కత్తి లాంటిది. దాన్ని జాగ్రత్తగా వాడితే అభివృద్ధికి తోడ్పడుతుంది.. లేదంటే జీవితాన్నే ఛిన్నాభిన్నం చేస్తుంది. ₹30 వేల జీతంతో ₹40 లక్షల అప్పు చేయడం అంటే ఆర్థిక ఆత్మహత్యతో సమానం. కాబట్టి ఆడంబరాలకు పోకుండా ఆర్థిక భద్రతకే ప్రాధాన్యం ఇవ్వడం నేటి యువతకు అత్యవసరం.



## ఎందుకు ఇలాంటి పరిస్థితి..

ఇప్పుడు లోన్ రావడం నిమిషాల్లో జరిగే పని. కేవలం ఆధార్, పాన్ కార్డ్ ఉంటే చాలు, మొబైల్ యాప్‌లు తక్షణమే డబ్బులు ఖాతాల్లో జమ చేస్తున్నాయి. దీంతో చాలా మంది ఈజీ లోన్ కోసం ప్రయత్నిస్తున్నారు. అలాగే ఇతరుల కంటే తక్కువ కాకూడదనే ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్ యువతను ఖరీదైన వస్తువుల కొనుగోలుకు ప్రేరేపిస్తోంది. "ఇప్పుడు కొనండి.. తర్వాత కట్టండి" అనే ప్రచారం కూడా యువతకు అప్పు చేస్తున్నామనే స్పృహ లేకుండా చేస్తోంది. ఇలాంటి ఎన్నో అంశాలు తెలియకుండానే అప్పు అనే మత్తులో ముంచేస్తూ చివరకు తెలియకుండానే ఆత్మహత్యలు చేసుకునే స్థాయికి తీసుకొస్తున్నాయి.



# పలు సమస్యలపై జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు వినతి

### రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకుల డిమాండ్



తుర్కయంజాల్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి : తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి కి వినతి పత్రంఅందజేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహ రెడ్డి (ఏఎన్ఆర్) నేతృత్వంలో నాయకులు మంగళవారం డిప్యూటీ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎలిమినేటి నరసింహ రెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణపల్లి జడ్‌పి రోడ్ (సాగర్ హైవే నుంచి తొర్రూర్ వరకు) ప్రస్తుతం ప్రమాదకరంగా మారిందని తెలిపారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేశారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు నివారించేందుకు వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు (సైన్‌బోర్డులు) ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. అదే విధంగా మునగనూరు పరిధిలోని పలు కాలనీలలో దాదాపు పది సంవత్సరాలుగా ప్రజలు నివాసం ఉంటున్నప్పటికీ సరైన రోడ్లు, వీధి దీపాలు లేకపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆయా కాలనీల అభివృద్ధికి అవసరమైన రోడ్లు, వీధి దీపాలు మంజూరు చేసి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సంబంధిత సమస్యలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరగా, డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిశీలించి పరిష్కారం కోసం చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్ నందగిరి, గుండ కృష్ణ, యాటలి శేఖర్ రెడ్డి, ఎలిమినేటి భరత్ రెడ్డి, అనిల్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# "సమాచార హక్కు ప్రజల శక్తివంతమైన ఆయుధం"

### ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఆర్‌టీఐ చట్టం సమర్థవంతంగా అమలు చేయాలి: డాక్టర్ చంటి ముదిరాజ్



హైదరాబాద్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి :సమాచార హక్కు చట్టం--2005ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో సమర్థవంతంగా అమలు చేసి, పౌరులు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులో అందించేలా చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ప్రతినిధులు తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డిని కోరారు. ఈ మేరకు జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో డీజీపీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. 2005లో అమలులోకి వచ్చిన ఈ చట్టం ద్వారా ప్రజలకు ప్రభుత్వ పనితీరును తెలుసుకునే హక్కు కల్పించబడిందని తెలిపారు. ప్రభుత్వం ప్రజల పన్ను డబ్బుతో నడుస్తున్నందున ఆ నిధులు ఎలా వినియోగం అవుతున్నాయో తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందని ఆయన పేర్కొన్నారు. రేషన్ పంపిణీ, పెన్షన్లు, పౌర సేవలు వంటి అంశాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఈ చట్టం ద్వారా ప్రజలు పొందగలరని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే సార్వభౌమాధికారులు కావడంతో ప్రభుత్వ పనితీరును పర్యవేక్షించేందుకు సమాచార హక్కు చట్టం ఒక శక్తివంతమైన సాధనమని డాక్టర్ చంటి ముదిరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, రాష్ట్ర కోఆర్డినేటర్ కొంగంటి రాజ్‌కుమార్, రాష్ట్ర కో-కన్వీనర్ గడప కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కడమంచి అజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాష్ పటేల్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ భవాని రామలింగేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి

### బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్



చింతపల్లి మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి : ప్రతి ఒక్కరూ శ్రీశ్రీశ్రీ భవాని రామలింగేశ్వర స్వామి అనుగ్రహం పొందాలని బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం చింతపల్లి మండల పరిధిలోని తిదేడు గ్రామంలో శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆనందంగా మెలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ ,కంకణాల వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ స్వప్న శేఖర్ రెడ్డి,కొండల్ నాయక్, నిరంజన్ గౌడ్,శీమర్ల క్రిష్ణ యాదవ్,మోతీరాం నాయక్, జైపాల్ నాయక్,గడ్డం శేఖర్,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదరికం మధ్యలో వెలిగిన విద్యా దీపం...

### దాతృత్వం చాటుకున్న ఏఎన్ఆర్

### పేదింటి బాలిక చదువుకు అండగా నిలిచిన దాతృత్వం

### సొంత నిధులతో ఫీజు చెల్లించిన బీజేపీ నాయకుడు ఎలిమినేటి నరసింహారెడ్డి



తుర్కయంజాల్, మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి :సమాజంలో సేవా భావంతో ముందుకు వచ్చి పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం సహాయం చేయడం అరుదుగా కనిపించే సమయంలో, తుర్కయంజాల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహ్మ రెడ్డి (ఏఎన్ఆర్) చేసిన సహాయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. పేద కుటుంబానికి చెందిన ఓ బాలిక చదువు ఆగిపోకుండా ఉండేందుకు ఆయన స్వయంగా ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గంగాపురం ప్రణతి ప్రస్తుతం తుర్కయంజాల్‌లోని బ్రిలియంట్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో చదువు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆమెకు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆపన్న హస్తం అందించారు. ప్రతి సంవత్సరం తన సొంత నిధులతో ఆమె విద్యా ఖర్చులను భరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పాఠశాలను స్వయంగా సందర్శించిన ఎలిమినేటి నర్సింహ్మ రెడ్డి, ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజును చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం కారణంగా ఎవరూ చదువు మధ్యలో ఆపివేయకూడదని, ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. సమాజంలో సామర్థ్యవంతులు ఇలాంటి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చాలా అరుదుగా కనిపిస్తున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సహాయాలు ఎంతో ప్రేరణనిస్తాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బచ్చి గళ్ళ రమేష్, ఏఎన్ఆర్ టీం సభ్యులు, బీజేపీ నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ భవాని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

### రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్






చింతపల్లి మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి : తీదేడు గ్రామ కొండపై కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ భవాని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న సందర్భంగా మంగళవారం దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ రథోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా గుట్టపై కొలువుదీరిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా పంటలు పండాలని కోరుకున్నారు. అనంతరం ఆలయ పాలకవర్గం, స్థానిక నాయకులు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు.

అనంతరం తీదేడు గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉల్వాల స్వప్న శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇడమోని వెంకటయ్య యాదవ్, మాజీ సర్పంచులు కాయితీ జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్, అధికారులు ఎంపీడీవో సుజాత, ఎంపీఓ ఇందూజ,హౌసింగ్ ఏఈ చందు, కార్యదర్శి అశోక్, నాయకులు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, దొంతం సంజీవరెడ్డి, టి పి సి సి స్టేట్ మెంబర్ సిరాజ్ ఖాన్, నల్ల రఘుమారెడ్డి,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, కొండూరు పవన్ కుమార్, వడ్త్య దేవేందర్ నాయక్, ఆలంపల్లి నరసింహ్మ ,పున్న వెంకటేష్, కాసారపు శ్రీనివాస్, లింగంపల్లి వెంకటయ్య,ఎండి సిద్ధిక్ బాబా, ఎల్లంకి రాధాకిషన్,నర్సిరెడ్డి, సదానందం,కొరివి యాదగిరి, గుణమోని కొండల్,కట్ట మహేష్, ముద్దం మల్లేష్, ఎస్.కె బాలమియ గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముస్తాబైన శ్రీ గట్టు లక్ష్మీ మైసమ్మ ఆలయం

చింతపల్లి మార్చి 10 నిర్భయవార్త ప్రతినిధి : భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందిన శ్రీ గట్టు లక్ష్మీ మైసమ్మ జాతర ఉత్సవాలు గురువారం నుంచి చింతపల్లి మండల పరిధిలో ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఆలయాన్ని ముస్తాబు చేశారు. హైదరాబాద్ - నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి, నసర్లపల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కనే శ్రీగట్టు లక్ష్మీ మైసమ్మమాత ఆలయాన్ని సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించారు. భక్తులు ఇచ్చిన విరాళాలతో అమ్మవారి విగ్రహా ప్రతిష్ట చేశారు. ఈ దేవాలయం రాష్ట్ర రహదారి పక్కనే ఉండడంతో మండల ప్రజలే కాక ఇతర మండలాల ప్రజలు ఎంతో నమ్మకంతో అమ్మవారిని కొలుస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలోనే నాగుల పుట్ట కూడా ఏర్పడింది.

మూడు రోజులపాటు ఉత్సవాలు

తనను నమ్మిన భక్తులను చల్లగా చూసే చల్లని తల్లి, కరుణించి కాపాడే ముగ్గురమ్మ మూళ్లపుటమ్మ శ్రీ గట్టు లక్ష్మీ మైసమ్మ జాతర ఉత్సవాలు 12 నుంచి మూడు రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం జాతర ప్రారంభం, అమ్మవారి పూజ, శుక్రవారం బోనాలు, పలహారపు బండ్లు, వనవాసం, అన్నదానం, 14న జాతర ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు. జాతర ఉత్సవాల సందర్భంగా





ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఆలయ నిర్మాణం, ఉత్సవాలను భక్తుల విరాళాలతో ఏటా ఘనంగా నిర్వహించుకోవడం విశేషం. ఉత్సవాల సందర్భంగా భజనలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పీఠాధిపతులు దున్న ఇద్దయ్య. పర్వతనంద స్వాములు ప్రతిష్టించిన ఈ గట్టు లక్ష్మీ మైసమ్మ ఆలయం ముస్తాబవుతున్న మైసమ్మ దేవాలయం, ప్రత్యేక అలంకారంలో అమ్మవారు. దీంతో అమ్మవారి దర్శనం అనంతరం పుట్టలో పాలు పోసి, గుడ్డు పెట్టి నాగులకు పూజలు నిర్వహిస్తారు. భక్తులు ప్రతి ఆది, శుక్రవారాల్లో ముడుపులు కట్టి కోర్కెలు కోరుకుంటారు. కోరిన కోర్కెలు తీరగానే అమ్మవారికి పూజలు జరిపి మొక్కులు తీర్చుకుంటారు. రహదారిపై వచ్చిపోయే భక్తులతో ఆలయం ఎల్లప్పుడూ సందడిగా ఉంటుంది. నూతన వాహనాలు కొనుగోలు చేసి పూజలు చేయిస్తుంటారని,శ్రీ గట్టు లక్ష్మీ మైసమ్మ పూజలను పూజారి గండికోట శేఖర్, దేవదాస్ తెలిపారు.

# సినిమా సిత్రం

## మిరాయ్' పాప డ్రీమ్ స్కెచ్ అదిరింది!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ క్రేజ్ -పుష్ప 2 -తరువాత భారీ స్థాయికి చేరుకుంది. ప్రభాస్ తరువాత ఈ రేసులోకి సోలో హీరోగా క్రేజీ స్టార్‌లు రామ్ చరణ్, ఎన్టీఆర్ వచ్చి చేరతారని అంతా ఊహిస్తే ఆ ఇద్దరినీ ఓవర్ టేక్ చేసి సెకండ్ ప్లేస్‌ని బన్నీ ఆక్రమించేశాడు. పాన్ ఇండియా స్టార్‌లలో రెండవ స్థానానికి -పుష్ప2-తో చేరుకున్న బన్నీ ఇప్పుడు ఆ స్థాయికి మించిన సినిమాల్లో నటిస్తూ హాట్ టాపిక్ అవుతున్నాడు. కెరీర్‌ని సరికొత్తగా ప్లాన్ చేసుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ప్రస్తుతం బన్నీ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్షన్‌లో సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తున్న భారీ పాన్ వరల్డ్ మూవీలో నటిస్తున్నాడు. దీనికి సంబంధించిన షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. దీపిక పదుకునే మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్ కూడా నటిస్తున్నారని తెలుస్తోంది. వచ్చే నెల గ్లింప్స్‌ని రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాతో పాటు బన్నీ మరో రెండు క్రేజీ ప్రాజెక్ట్‌లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తెలిసిందే.-ఏఏ23ని లోకేష్ కనగరాజ్‌తో,-ఏఏ24ని సందీప్‌రెడ్డి వంగతో ప్లాన్ చేసుకున్న బన్నీ-ఏఏ25ని మాత్రం మలయాళ నటుడు, దర్శకుడు బసిల్ జోసెఫ్‌తో చేయాలని ప్లాన్ చేసుకుంటున్నాడు. ఇదిలా ఉంటే సాన్ ఇండియా స్థాయి క్రేజ్‌ని సొంతం చేసుకుని హాట్ టాపిక్‌గా మారిన ఐకాన్ స్టార్‌పై కర్చీఫ్ వేసేస్తోంది మిరాయ్ పాప రితికా నాయక్. ఢిల్లీలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కాలేజ్ ఫర్ ఉమెన్ లో హయ్యర్ ఎడ్యూకేషన్ పూర్తి చేసి ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్ 12 సీజన్ విజేతగా నిలిచింది. ఆ తరువాత సినిమాల్లో అరంగేట్రానికి చాలా ప్రొడక్షన్ కంపనీల చుట్టూ తిరిగి ఆడిషన్‌లలో పాల్గొంది. ఫైనల్‌గా 2022లో మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ హీరోగా నటించిన -అశోకవనంలో అర్జున కల్యాణం-తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చేసింది ఫస్ట్ మూవీతో బెస్ట్ ఫిమేల్ డెబ్యూట్ అవార్డుని దక్కించుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. తేజ సజ్జ -మిరాయ్-లో కొంచెం బొద్దుగా మారి విభ క్యారెక్టర్‌లో హీరోకు కర్తవ్యబోధ చేసి తన లక్ష్యాన్ని గుర్తు చేసే క్యారెక్టర్‌లో కనిపించి ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆనంద్ దేవరకొండ హీరోగా మిథున్ వరదరాజ కృష్ణనన్ రూపొందిస్తున్న ద్విభాషా చిత్రం -డ్యుయెట్-తో పాటు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న



హారర్ థ్రిల్లర్ -కొరియన్ కనకరాజు-లో నటిస్తోంది. ఇందులో -కొరియన్ కనకరాజు- ఈ సమ్మర్‌కు రిలీజ్‌కు రెడీ అవుతోంది. రెండు క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తున్న రితికా నాయక్‌కు ఓ డ్రీమ్ ఉందట. అదేంటంటే ఎప్పటికైనా ఐకాన్ స్టార్ సినిమాలో నటించాలన్నదే తన డ్రీమ్ అంట. అల్లు అర్జున్ సినిమాలో చిన్న రోల్ అయినా సరే నటించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని చెబుతోంది. మరి బన్నీ.. రితిక డ్రీమ్‌ని గుర్తించి తన సినిమాల్లో అవకాశం కల్పిస్తాడా? అన్నది వేచి చూడాల్సిందే.



## కామెంట్స్‌తో.. వేధింపులు

### లావణ్య త్రిపాఠిపై అసభ్య పోస్టులె

- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు
- ఆ పోస్టులు డిలీట్ చేయాలని రిక్వెస్ట్
- నిందితుల గుర్తింపునకు పోలీసుల చర్యలు

**తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు, కామెంట్లు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నటి లావణ్య త్రిపాఠి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. కొంత కాలంగా 'పర్పుల్ క్రెయాన్ 00' అనే ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తన వ్యక్తిగత జీవితం, నైతిక విలువలను కించపరిచేలా పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అత్యంత అసభ్య పదజాలంతో కామెంట్లు చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని పోలీసులకు వివరించారు. ఈ వేధింపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వివాదాస్పద పోస్టులను వెంటనే తొలగించాలని కోరారు. లావణ్య ఫిర్యాదును స్వీకరించిన సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 67తో పాటు, భారత న్యాయ సంహితలోని సెక్షన్లు 78, 79 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సదరు ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను నిర్వహిస్తున్న నిందితులను గుర్తించేందుకు సాంకేతిక ఆధారాలతో విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.**



## తాయి కిళవి.. సంచలనం

- 75 ఏళ్ల బామ్మగా రాధిక నటన
- అద్భుతం అంటున్న అభిమానులు

ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా తమిళ, తెలుగు భాషల్లో అనేక హిట్ సినిమాల్లో నటించిన సీనియర్ నటి రాధిక శరత్ కుమార్.. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త చిత్రాల్లో నటిస్తూ.. తన నేచురల్ యాక్టింగ్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు ఆమె లీడ్ రోల్ లో నటించిన తాయి కిళవి సినిమా విజయంతో మరోసారి వార్తల్లో నిలిచారు. రీసెంట్ గా తేదీన రిలీజైన ఆ సినిమా మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. విడుదలైన మొదటి షో నుంచి అందరినీ ఆకట్టుకుని దూసుకుపోతోంది. సినిమాలో రాధిక 75 ఏళ్ల బామ్మ పాత్రలో కనిపించగా.. ఆమె యాక్టింగ్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. మూవీ స్టోరీతోపాటు ఎమోషనల్ సీన్స్.. ఆడియన్స్ ను ఫుల్ గా ఆకట్టుకున్నాయి. అలా రాధిక నటన, స్టోరీ.. ఆడియన్స్ ను థియేటర్స్ కు రప్పిస్తున్నాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద సినిమా భారీ వసూళ్లు సాధిస్తోంది. రిలీజ్ అయిన తొలి వారంలో రూ.25 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇప్పుడు పది రోజుల్లో ఏకంగా రూ.50 కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించి అబ్బురపరిచింది. ఆ విషయాన్ని సోషల్ మీడియాలో మేకర్స్ వెల్లడించారు. దీంతో ఇప్పుడు తాయి కిళవి సినిమా కోసమే అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. అయితే ఒక సీనియర్ నటి లీడ్ రోల్ లో నటించిన సినిమా ఇంత తక్కువ సమయంలో అంతటి రేంజ్ వసూళ్లు సాధించడం అరుదైన విషయమనే చెప్పాలి. ముఖ్యంగా ఒక బామ్మ పాత్ర చుట్టూ తిరిగే కథతో రూపొందిన మూవీ.. భారీ కమర్షియల్ విజయం అందుకోవడం కూడా రేర్. అదే సమయంలో 60 ఏళ్లు పైబడిన నటి లీడ్ రోల్ లో నటించిన చిత్రం ఆ రేంజ్ విజయం సాధించడం కోలీవుడ్ చరిత్రలో తొలిసారి.

## శృతి గీతం



### సోషల్ మీడియాలో హల్‌చల్

- కొత్త ఫొటోలతో అభిమానులకు కనువిందు
- వారణాసి కోసం గళమెత్తిన భామ

కమల్ హాసన్ నట వారసురాలు అయినప్పటికీ శృతి హాసన్ సొంతంగానే తనకంటూ బ్రాండ్ ఇమేజ్‌ని సొంతం చేసుకుంది. ఇండస్ట్రీలో శృతి హాసన్ కి ఒక ప్రత్యేక శైలి ఉందని అంతా అంటారు. ఆమె కేవలం ఒక హీరోయిన్ మాత్రమే కాకుండా, మల్టీ ట్యాలెంట్ తో పలు సార్లు తానేంటో నిరూపించుకుంది. ఇటీవల మహేష్ బాబు రాజమౌళి కాంబోలో రూపొందుతున్న వారణాసి సినిమా కోసం పాట పాడటం ద్వారా వార్తల్లో నిలిచింది. అంతే కాకుండా వారణాసి ఈవెంట్‌లోనూ లైవ్ పర్ఫార్మెన్స్ ఇచ్చింది. సాధారణంగా హీరోయిన్స్ స్టేజ్ పై డాన్స్ చేసేందుకు ఆసక్తి చూపించరు. అంతటి సాహసం చాలా తక్కువ మంది మాత్రమే చేస్తారు. కానీ శృతి హాసన్ మాత్రం ఆ సాహసం చేసింది. తాను మల్టీ ట్యాలెంటెడ్ అని దీంతో మరోసారి అందరికి చెప్పకనే చెప్పింది అంటూ ఆమె అభిమానులు అంటున్నారు.

సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే శృతి హాసన్ ఆ మధ్య కాస్త దూరంగా జరిగింది. మళ్లీ సోషల్ మీడియాలో రీ ఎంట్రీ ఇచ్చింది. తాజాగా తన హెయిర్ డ్రెస్సర్‌తో ఉన్న ఒక వీడియోను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. హెయిర్ స్టైలిస్ట్ నూరితో ఉన్న సరదా వీడియోను శృతి హాసన్ షేర్ చేసింది. ఒక షూటింగ్ సందర్భంగా నూరితో ఈమె టైం స్పెండ్ చేసింది. హెయిర్ డ్రెస్ చేస్తున్న సమయంలోనే వీడియోను తీసి దాన్ని ఇన్‌స్టాలో షేర్ చేయడం ద్వారా తనతో వర్క్ చేసే వారితో శృతి ఎంత జోవియల్‌గా, సరదాగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి మనసున్న వ్యక్తి శృతి హాసన్ అంటూ పలువురు ఈమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

## స్విమ్ సూట్‌లో మెస్మరైజ్

### గ్లామర్ ఒలకబోస్తున్న దేవయాని



అందం, అభినయంతో ఎప్పటికప్పుడు ట్రెండీ ఔట్ ఫిట్ తో వార్తల్లో నిలిచే దేవియాని శర్మ తాజాగా స్విమ్ సూట్ తలపించేలా గ్రీన్ కలర్ డ్రెస్‌లో కనిపించి అందాలతో మెస్మరైజ్ చేసింది. రాళ్లపై చాలా ప్రత్యేకంగా ఫోజులిచ్చిన ఈమె.. అందులో కాన్ఫిడెంట్ లెవెల్స్ ను మరింత పెంచుకుందనే చెప్పాలి. గ్లామర్ తో హీట్ పుట్టించడమే కాకుండా హుందాతనంగా స్పెషల్ ఫోజులు ఇచ్చిన తీరుకు అభిమానులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం దేవియాని శర్మ షేర్ చేసిన ఈ అవుట్ ఫిట్ సోషల్ మీడియాలో హీట్ పుట్టిస్తోంది.. అసలే వేసవి మొదలవుతుంటే.. భగభగ మండే సూర్యుడు తాపానికి తట్టుకోలేకపోతుంటే.. మీరేమో ఇలా గ్లామర్ వలకబోస్తూ నెట్టింట హీట్ పుట్టిస్తున్నారు అని అభిమానులు సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈమె షేర్ చేసిన ఈ ఫొటోలు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

## స్టైలిష్ లుక్‌లో.. మిల్కీ బ్యూటీ!

- కొత్త ఫొటో షూట్‌లో తమన్నా
- ఆకట్టుకుంటున్న ఆటిట్యూడ్

బాలీవుడ్ నుండి టాలీవుడ్ వరకు తన అందం, అభినయంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా, సోషల్ మీడియాలో మరోసారి సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఎప్పుడూ ట్రెండీగా ఉండే తమన్నా, ఈసారి క్లాసిక్, ఎలిగెంట్ లుక్ లో మెరిసిపోతూ కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టిస్తోంది. స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోతున్న మిల్కీ బ్యూటీ ను చూసి అభిమానులు క్వీన్ ఆఫ్ స్టైల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.. తమన్నా షేర్ చేసిన తాజా ఫోటోలలో ఆమె ధరించిన అవుట్‌ఫిట్ ఆమె ఎలిగెన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లింది. మినిమల్ మేకప్, సింపుల్ హెయిర్ స్టైల్ , ఆమె సిగ్నేచర్ స్మైల్‌తో కెమెరాకు ఫోజులిచ్చిన తీరు నెటిజన్లను కట్టిపడేస్తోంది. ఎలిగెన్స్ అంటే కేవలం బట్టలు మాత్రమే కాదు, అది మన ఆటిట్యూడ్‌లో ఉంటుంది అని చెప్పకనే చెబుతోంది ఈ భామ. ఈ పోస్ట్ కింద కొందరు అభిమానులు 'ఎవర్ గ్రీన్ బ్యూటీ' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. కేవలం కొద్ది నిమిషాల్లోనే ఈ ఫోటోలు లక్షలాది లైకులను సంపాదించుకోవడం తమన్నా క్రేజ్ కు నిదర్శనం.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197